
# శివ అష్టోత్తర శతనామ స్తోత్రం



-బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారు



Disclaimer: This document is not for commercial purpose

## ముందు మాట

**శ్రీ గణేశాయ నమః          శ్రీ సరస్వత్యై నమః          శ్రీ గురుభ్యో నమః**

కార్తీక మాసం లో గురువుగారు, బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గురువు గారు "శివ అష్టోత్తర శతనామావళి" ప్రవచనం విసే భాగ్యం కలిగింది. ఈ ప్రవచనాన్ని మన school "గురుజ్ఞానం" you tube videos లో లభ్యమైనది.

https://www.youtube.com/watch?v=_O3vGPTBPqA&list=PLBB64oZyWpq4Yusji9RdtQwsPzAxu5BSv&index=26

అది వింటునప్పుడు కలిగిన అనుభూతి తో, ఆ నామాల అర్థం క్లుప్తంగా వ్రాసి సహృదయులైన మీ అందరితో పంచుకోవాలి అని అనిపించింది. అపారమైన జ్ఞానాన్ని మన గురుదేవులు ఏంతో ప్రకృష్టమైన రీతి లో సమకూర్చి చెప్తే, క్లుప్తీకరించటం భావ్యం కాదు. కానీ నామం వినగానే, లేదా అనుకోగానే ఒక్క అర్థమైనా స్పృహకి రావాలి అని ఈ సాహసానికి పూనుకోవటం జరిగినది.

తప్పులు అన్ని నావి! జ్ఞానం అంతా మన గురుదేవులది.

వారి కృప ఉన్నది అనే ధైర్యం తో ఇంత గంభీరమైన విషయంని ఒక చిన్న పుస్తకం రూపం లోకి తేవటం జరిగింది. ఏ పని కైనా అందరి మంచి మనస్సు తో కూడిన సహాయం అవసరం.

ఆలా సహాయ పడినవారి లో రాధికా కామేశ్వరి గారు మొదటి వ్యక్తి. అడగగానే ఒప్పుకుని తెలుగు editing చెయ్యటానికి ముందుకు వచ్చారు. వారికి నా కృతజ్ఞతలు. అనూష భరద్వాజ్ గారు చక్కని template తయారు చేసి శీర్షికకి అనుగుణంగా తీర్చిదిద్దారు. వారి సహాయానికి చాల సంతోషం కలిగినది. పవన్ తన పేరు కి తగట్టు మన స్కూల్ ని తన భుజాలపై వేసుకుని కార్య సిద్ధి కి కారణం అవుతాడు. అతనికి నా ఆశీస్సులు. విద్య తాడంకి లేకుంటే ఎలాంటి కార్యాలు చేసే అవకాశమే లేదు. ఆవిడ ఆధ్వర్యంలో ఎన్నో చక్కటి కార్యక్రమాలు

కొనసాగుతున్నాయి. గురుభ్యో నమః గురుకులం కి వెన్నుదండ ఆవిడ. ఆవిడకి ఇవ్వటానికి ధన్యవాదాలు తప్ప ఇంకేమి లేవు నా దగ్గర.

ఈ గురుకుల సాంగత్యం నా పూర్వ జన్మ సుకృతం. ప్రతి విద్యార్థి ద్వారా ఎన్నో మంచి విషయాలు నేర్చుకోవడం జరుగుతోంది. ప్రతి విద్యార్థి కుటుంబ సభ్యులకి ఆ పరమేశ్వరుడి కృప ఎల్లవేళ ఉండాలి అని ప్రార్థిస్తూ.సర్వం శివార్పణం . సర్వం శ్రీ గురుచరణారవిందార్పణం.

స్వస్తి.

మీ

సాయి వారణాసి.

## ఉపోద్ఘాతం

పరమేశ్వరుని దివ్య నామాలను ఒక మంత్ర పద్ధతి లో సమకూర్చిన స్తోత్రము శివ అష్టోత్తర శతనామ స్తోత్రం.

దీనియొక్క దివ్యత్వం పురాణాలలో వర్ణించబడుతున్నది. ఈ దివ్య నామాల అర్థం తెలిసి ఒక్కసారి పలికినప్పటికీ అమోఘమైన ఫలితం లభిస్తుంది గనుక అర్థ జ్ఞానం తో, అర్థ స్ఫురణ తో నామ అర్చన చెయ్యాలి అని పెద్దలు నిర్దేశించారు. ఆ నూట ఎనిమిది నామాలు చెప్పుకుని ధన్యులం అవుదాము.

ఇది ఒక మంత్రము.ఈ మంత్రాన్ని మనకి ఇచ్చిన వాడు వ్యాసదేవుడు. స్కాంద పురాణం లోని శాంకర సంహిత లో, శివ రహస్య ఖండం లోని ఈ నూట ఎనిమిది నామాలు శివ పూజ లో ప్రసిద్ధిగా వాడబడుతూ ఉంటాయి. దీనియొక్క మహిమ స్కాంద పురాణం లో చెప్పబడుతుంది .ఇది గౌరీ నారాయణుల సంవాద రూపము .అమ్మవారు పార్వతిదేవి, శివుని పతిగా వరించి , శివుని లో అర్ధనారీశ్వరత్వం పొందటానికి తపస్సు చేస్తున్నది .ఆ సమయం లో తపస్సు ఎప్పటికి ఫలిస్తుందా  అనే తపన బయల్దేరింది తల్లికి. ఎన్నో ఏళ్ళు తపస్సు చేసింది. అయినప్పటికీ సిద్ధి లభించటం లేదు. ఆ స్థితి లో నారాయణుడు తపో భూమికి వచ్చాడు.

సోదరుడు ఐయిన నారాయణుడుకి నమస్కరించి తల్లి అడిగింది

**“శరీర అర్థం అహం సంభోర్యేన ప్రాప్స్యామి కేశవ ? తదిదాని మమ చక్ష్వ స్తోత్రం శీఘ్ర ఫల ప్రదం”**

శివుని అనుగ్రహం తొందరగా లభించటానికై ఏమార్గం ఉన్నదో దాన్ని ఉపదేశించమని అడిగింది. నారాయణుడు చెప్తున్నాడు, ఎందుకంటే శివ తత్త్వానికి గురువు నారాయణుడే. అలాగే విష్ణు భక్తులకు శివుడు గురు స్థానం లో ఉంటాడు. నారాయణుడు అమ్మవారికి చెవుతున్నాడు:

**“అస్తి గుహ్యతరం గౌరీ నామ్నామష్టోత్తర శతం, అహం ప్రాష్యమి పటతాం శీఘ్ర కామదం”.**



info@gurujnanam.org
Disclaimer: This document is not for commercial purpose

ఆ నూట ఎనిమిది నామాల తో కూడిన విద్య ఉన్నది. ఆ విద్యని నీకు ఉపదేసిస్తాను. నీవు శీఘ్రముగా శివుని అనుగ్రహం పొందుతావు. అటువంటి అష్టోత్తర నామాలు చెప్పుకుంటున్నాము. వీటి మహిమ గురించి నారాయణుడు ఇలా చెప్పాడు. ఈ నూట ఎనిమిది నామాలు వేదముల నుంచి స్వీకరించినవి. శృతుల యందు ఉన్న 108 నామాలు ఏరి కూర్చినవి. ఇవి శంకరునికి అత్యంత ప్రీతికరమైనవి. వీటిని పఠించవలసిన పద్ధతి ఏమిటి అంటే రోజు మూడు పూటలా ఈ నామాలు సంవత్సరం కాలం పఠిస్తే అద్భుతమైన ఫలం లభిస్తున్నది.



అది విన్న పార్వతీదేవి ఈ 108 నామాలు మూడు పూటలా ఉపాసన చేసింది. దాని ఫలం గా సంవత్సర కాలం లో శివ దర్శనం శివుడి తో వివాహం లభించింది అని స్కాంద పురాణం లో చెప్పిన అంశం.

అలాంటి మంత్రరాశి పరంపర గా వ్యాసుడి దయ వల్ల మనకి లభించింది. వ్యాసుడు చెప్తున్నాడు:

**"య త్రిసంధ్యం యహ పఠేత్ నామ్నామష్టోత్తరం శతం, శత రుద్రం క్రియ హృత్య యత్ ఫలం లభతే నరః, తద్ ఫలం ప్రాప్నుయాత్ నిత్యం ఏకా హృత్య,న సంశయః".**

మూడు మార్లు రుద్రం పఠిస్తే యెంత ఫలితమే ఒక్క మారు శివ అష్టోత్తరం పఠిస్తే అంత ఫలితం. రోజు కి త్రిసంధ్యలలో పఠించాలి. ఆ నామం తో బిల్వ పత్రం తో పూజిస్తే వంశం అంతా తరిస్తుంది. మారేడు దళాలు, పుష్పములు, తులసి దళములు,నువ్వుల బియ్యం ( తిల అక్షింతలు) కలిపి , ఈ నామాల తో అర్చిస్తే జీవన్ముక్తులు అవుతారు అని నారాయణుడు చెప్పిన మాటలు.

**ధ్యాన శ్లోకం:**

**"ధవళ వపుషమిందోర్మండలే సన్నివిష్టం**

**భుజగ వలయ హారం, భస్మదిగ్ధాంగమీశం**

మృగయ పరశుపాణిం చారు చంద్రార్ధ మౌళిమ్

హృదయ కమల మధ్యే సతతం చింతయామి”

ధ్యాన శ్లోకానికి మంత్ర రాశి కి ఒక సంబంధం ఉంటుంది .అది ధ్యానించినప్పుడు ధ్యానించి వారికి ఒక అద్భుతం లభిస్తుంది .హృదయ కమలం లో చంద్ర మండలాన్ని ధ్యానించాలి .తెల్ల గా చల్లగా ఉన్నటువంటి చంద్రమండలం , ఆ చంద్ర మండల మద్యం లో పరమేశ్వరుడు కూర్చున్నాడు , కూర్చోటం ఎలా కూర్చున్నాడు అంటే “ధవళ వపుషం”, తెల్లని శరీర కాంతి తో ఉన్నాడు, నెలవంక ని ధరించి ఉన్నాడు , భుజగ భూషణుడు ,సర్పములను ఆభరణముగా ధరించిన వాడు , భస్మరేఖలు ధరించిన వాడు,చేతుల యందు “ హరిణ పరశుపాణిం”, లేడీని ఒక చేతి తో , గొడ్డలి ని మరొక చేతి తో పట్టుకుని , క్రింది రెండు చేతులు వరద అభయ హస్తములు ధరించినటువంటి పరమేశ్వరుని హృదయ కమలం లో ధ్యానించాలి. పార్వతి దేవి ధ్యానించినప్పుడు ఒక్క పరమేశ్వరుణ్ణే ధ్యానించింది. భక్తులమైన మనం ధ్యానించినప్పుడు మాత్రం ,అమ్మవారితో ఉన్న ఈశ్వరుని ధ్యానిస్తూ ఈ నామాలు పఠించటం చాల శ్రేష్టం.

## నామార్థములు:

### 1.శ్రీ శివాయ నమః

శివ అంటే మంగళ స్వరూపుడు, శుద్ధస్వరూపుడు, శాంతస్వరూపుడు. ఇవి ప్రధానమైన అర్ధములు. నిఘంటు పరంగా శాంతము, శుద్ధము, శుభము, క్షేమము, మోక్షము, ఈ ఐదు శివ నామానికి ఉన్న అర్ధాలు.

“యః శివో నామ రూపాభ్యం”

శుభము ఆయన స్వభావము. మాలిన్య రహితుడు. జీవులు అందరికి మూడు రకాల మాలిన్యములు ఉంటాయి :



ఆనవా మలం.

కార్మిక మలం.

మాయిక మలం.

ఆనవా మలం అంటే జీవుడికి స్వతఃసిద్ధంగా ఉండే అజ్ఞానం. మాయిక మలం అంటే మనసులో ఆలోచనలు సంపర్కాలు వల్ల ఏర్పడే మాలిన్యము. కార్మిక మలం అంటే కర్మముల తో వచ్చే మాలిన్యం. ఈ మూడు మాలిన్యాలు ఉంటే జీవుడు. ఈ మూడు మాలిన్యాలు లేని శుద్ధమైనవాడు శివుడు. శివ నామ స్మరణ చేసే వాడికి ఈ మూడు మాలిన్యాలు తొలగి శుద్ధుడు అవుతున్నాడు.

**"ప్రపంచోపశమం శాంతం"**

ధ్యాన భూమిక లో యోగులు పొందే బ్రహ్మానందం పేరు శాంతం.

**శాంతి శాంతి శాంతిః !**

ఆది భౌతిక, ఆధ్యాత్మిక, ఆదిదైవిక తాపములు అణిగిన స్థితి కి శాంతం అని పేరు. ఆ శాంత స్థితిలో అనుభవానికి వచ్చే పరబ్రహ్మ తత్త్వం శివం. నాలుగో అర్థం "సర్వం వశీకృతం యస్మాత్ తస్మాత్ శివ ఇతి స్మృతః". జగత్ అంతా ఎవరి వశం లో ఉందో అదే శివం.శివ శబ్దాన్ని తిరగ వేసి చెవుతే వశి అవుతుంది .

**"వశకాంతౌ శివ స్మృతః"**

సర్వ జగత్తుని తన వశం లో పెట్టుకున్న వాడు శివుడు. జగత్తు శివుడి అధీనం లో ఉన్నది. శివుడు ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు . బ్రహ్మ మొదలు సర్వ పిపీలకాల వరకు, ప్రతి వారి కదలిక

ఎవరి అధీనం లో ఉన్నాయో, అతడే శివుడు. శివుడు అంటే ఈశ్వరుడు. అణువు మొదలు బ్రహ్మాండముల వరకు ప్రతీదీ ఎవరి అధీనం లో ఉన్నదో, ఆ పరమేశ్వరుడే శివుడు. ఇఛ్ఛాశక్తి కలిగిన పరమేశ్వరుడు అని ఒక అర్ధం. సృష్టి చేయక ముందు కేవలం శుద్ధ మైన పరమాత్మ ఉన్నాడు. అయినా సృష్టి చెయ్యాలి అని సంకల్పించాడు. ఆ సంకల్పం నుంచి ఈ ప్రపంచం అంతా ఆవిర్భవించింది. ఇఛ్ఛాశక్తి కలిగిన శివుడికి పరమేశ్వరుడు అని పేరు. శివ అంటే ఇఛ్ఛాశక్తి కలిగిన వాడు. సర్వ జగత్తుని నడిపించే స్వతంత్ర శక్తి కలిగిన వాడు. స్వతంత్ర ఇఛ్ఛాశక్తి కలిగిన పరమేశ్వరుణ్ణి శివ అని పిలుస్తున్నాము. ఇన్ని నామాలు అన్నప్పుడు ఆ తత్త్వ స్ఫూహ కలగాలి.

**"శరతే ప్రాణినో యత్ శివః"**

సర్వ జగత్తు ఎవరి అందు పుట్టి, ఎవరి అందు పెరిగి, ఎవరి అందు లయం అవుతోందో అదే శివం. సర్వ జీవులు దేనియందు ఉన్నాయో అదే శివం. శివ అనగా ఆధార శక్తి . మన అందరికి ఆధారమైన శక్తి ని శివం అంటారు.

శ కార, ఈ కార, (ఊ కార), వ కార ములు కలిస్తే శివ అయింది .

శ కారం శివుడిని

ఈ కారం అమ్మవారిని

ఉ కారం విష్ణువు ని తెలియ చేస్తుంది.

అశేష కల్యాణ గుణ స్వరూపుడు శివుడు.

## 2.శ్రీ మహేశ్వరాయ నమః

**"త్వం ఈశ్వరానాం పరమం మహేశ్వరం**

**త్వం దేవతానాం పరమం చ దైవతం ".**

దేవతలకే దేవుడు గనక మహాదేవుడు. ఈశ్వరులకే ఈశ్వరుడు గనుక మహేశ్వరుడు. ఈశ్వరుడు అంటే ప్రభువు, ఐశ్వర్యవంతుడు అని రెండు అర్థాలు. ఐశ్వర్యములు అన్నీ ఎవరి అధీనం లో ఉన్నాయో వాడు ఈశ్వరుడు. ఎవరు ఈ జగత్తు ని శాసించి పాలిస్తున్నాడో వాడు ఈశ్వరుడు. ఇలాంటి ఈశ్వరులు ఎంతో మంది ఉన్నారు . దేవ లోకానికి ఇంద్రుడు ఈశ్వరుడు, వరుణుడు వరుణ లోకానికి ఈశ్వరుడు, అలా దిక్పాలకులు అందరూ వారి వారి లోకాలకి ఈశ్వరులు. బ్రహ్మ బ్రహ్మలోకానికి ఈశ్వరుడు. ప్రతి వారి ఈశ్వరత్వానికి కాల పరిమితి దేశ పరిమితి ఉంటాయి. దేశ కాల పరిమితి లేని ఈశ్వరత్వం యెవరి దగ్గర ఉన్నదో, ఇంద్రాది దేవతలకు ఈశ్వరుడు ఎవరో, ఎవరి పైన ఈశ్వరుడు లేడో, వాడూ మహేశ్వరుడు.

**"మహాన్ ఈశ్వరహా"**

గొప్పవాడు, ఈశ్వరుడు, రెండు కూడా. ఈశ్వరుడు అంటే ప్రతివారికి స్ఫురించేది శివుడే. చంద్ర లేఖ ఒక్క శివుడి వద్దనే ఉన్నది, ఈశ్వరుడు అనే పిలుపు ఒక్క శివుడికే ఉన్నది. (చంద్రలేఖ అమ్మవారికీ, గణపతికీ కూడా ఉన్నది, వారు ఇద్దరూ శివ స్వరూపాలే). సర్వ ఐశ్వర్య సంపన్నుడు, సర్వ లోక పాలకుడు శివుడు.

## 3.శ్రీ శంభవే నమ:

శంభు: భు అనే శబ్దానికి " మూలమైన వాడు", ఆధారమైన వాడు అని అర్ధం.

శం : శుభం , శాంతి , సుఖము


శంభు : శుభానికి, శాంతికి , సుఖానికి మూలమైన వాడు , అధారమైన వాడు . ఈ మూడూ ఈశ్వరుడి నుంచే లభిస్తాయి. ఈ మూడూ కావాలి అంటే ఆయననే పట్టు కోవాలి, ఆయన వల్లే కలుగుతున్నాయి అనే స్ప్రహ ఉండాలి.

" ఈశ్వరుడు ఇవ్వాలి, ఇల్లు నిండాలి "

ఆకాశం లో ఉన్న శివ తత్త్వాన్ని శంభు అనాలి. అనంత ఆకాశములో కేంద్రించి వ్యాపించిన చిత్ శక్తి స్వరూపుడు శంభు. దీనినే ఉపాసనా శాస్త్రం లో పరశంభు అని అంటారు. ఆకాశం అంతా వ్యాపించింది శివ తత్త్వమే.

## 4. శ్రీ పినాకినే నమః

పినాకం అంటే శివుడి ధనుస్సు యొక్క పేరు. ఆ ధనుస్సు ని ధరించిన వాడు పినాకి. శివుడి ధనుస్సులు అనేకం ఉన్నాయి. వేదములలో "శత ధన్వనేచ" అని నామం ఉన్నది. "శత ధన్వనే" అంటే అనంతమైన ఆయుధములు కలుగు వాడు. శివుడు అనేక రూపాల తో అనేక రకముల ధనుస్సులు ధరించి కనబడుతున్నాడు. శివుడు మేరు పర్వతాన్ని విల్లుగా తీసుకున్నాడు అని కథ చెప్తారు. త్రిపురాసుర సంహారం చేసినది ఈ ధనుస్సు తోనే. అదే విధంగా దక్ష యజ్ఞ విధ్వంసనం లో దక్షుడిని సంహరించటానికి తన యొక్క శక్తి ని ప్రయోగించి అతని శిరస్సుని ఛేదించాడు, అటు తరవాత దేవతలు శివుడి ముందు భయపడుతూ నిలబడ్డారు. ధర్మ విరుద్ధ మైన దక్ష యజ్ఞం లో పాలుగొన్నందుకుగాను శివుడు కోపగించుకుని ధనుస్సుని పట్టుకున్నాడు. అప్పుడు దేవతలు శరణు వేడి "స్వామి క్షమించు" అని అడిగారు. ధనుస్సు ఎక్కు పెట్టిన, క్షమించు అని వెడుకోగానే ఉపసంహరించాడు. శివుడు శరణాగత వత్సలుడు.



ఆ ధనుస్సుని జనక మహారాజు పూర్వీకులలో దేవరాతుడు అనే వాడు, శివుడి ప్రసాదంగా స్వీకరించి నిరంతరం ఆరాధించేవాడు. రాముడు శివధనస్సు భంగం చేసినది దక్షయజ్ఞం లో శివుడు వాడినదే.

**"నాకినామ్ అపి పాతుం సంహర్తహ, ఇతి పినాకం".**

అంటే స్వర్గలోక వాసులైన దేవతలని కూడా రక్షించే శక్తి కలిగినదేదో అది పినాకం. సృష్టి లో ఏ విపరీతం వచ్చినా దేవతలు రక్షిస్తారు. దేవతలను కూడా రక్షించే ధనుస్సు పినాకము. "నాకం" అనగా స్వర్గం. "నాకీ" అనగా స్వర్గంలో ఉన్న దేవతలు. వాళ్ళని రక్షించేది పినాకి. పినాకి అనగా

దేవతలను రక్షించేవాడు, దేవతలను రక్షించే ధనుస్సు కలిగిన వాడు. సర్వ లోక రక్ష ని చూపిస్తున్నాడు. అటువంటి మూర్తి ని ధ్యానించాలి, రుద్రం "పినాకం పట్టుకుని రావయ్యా" అని చెపుతుంది.

## 5. శ్రీ శశిశేఖరాయ నమః

అంటే చంద్రశేఖరుడు.శేఖరం అంటే శిరస్సు పై పెట్టుకునే అలంకారం .శిరస్సు పై చంద్రుడిని ధరించినవాడు పరమేశ్వరుడి చంద్రశేఖర నామం చాల విశేషం అయినది .మార్కండేయుణ్ణి యముడు తీసుకుని వెళ్ళటానికి వచ్చినప్పుడు అతనికి స్ఫురించిన నామం ఇదే .

"చంద్రశేఖర చంద్ర శేఖర చంద్రశేఖర పాహిమాం

చంద్రశేఖర చంద్రశేఖర చంద్రేశేఖర రక్ష మామ్"

అని శివుడిని శరణు వేడాడు.

"చంద్ర శేఖరమాశ్రయే మమ కిమ్ కరిష్యతి వై యమః"!

శివుడు అనగానే మనకి నెలవంక గుర్తుకు వస్తుంది. నెలవంక నే సాధక్య కళ, ధ్రువ కళ అంటారు. లోకం అంతా పరిణామ శీలం, అంటే ఏ రోజు ఒకే లాగ ఉండదు .మారుతూ మారుతూ చివరికి అంతరించిపోవడం లోక లక్షణం .మార్పుకి లోనై నశించే కళలు పదిహేను .ఏ మార్పు లేకుండా ఉండే శాశ్వత కళ పదహారో కళ. ఈ పదహారో కళకే సాద్రక్ష్య కళ, శాశ్వత కళ, ధృవ కళ, అమృత కళ అని అనేక నామాలు. ఆ పదహారో కళని తన తల పై పెట్టుకుంటాడు స్వామి. అంటే తాను శాశ్వత తత్త్వము, అమృత తత్త్వము అనే ఉదేశ్యం. మృత్యుంజయ తత్త్వం కూడా కనబడుతుంది. మృత్యుంజయత్వం కోసం మార్కండేయుడు చంద్రశేఖర అనే శబ్దం వాడాడు.

ఇంకో అర్థం:

పరమేశ్వరుడు ఓం కార రూపుడు. అ కార, ఉ కార, మ కార తురీయము అని కనబడుతుంది. ఈ తురీయా తత్త్వం నాద బిందు అనే రూపముల తో ఉంటుంది. ఈ నాద బిందు తత్త్వమే చంద్రకళగా గోచరిస్తుంది. "అ" కార "ఉ" కార "మ" కారములు పరమేశ్వరుడి పాదం నుండి

శిరస్సు వరకు గోచరిస్తుంది. నాద బిందు రూపం పైన నెలవంక తురీయం అని, శివుడు తురీయ తత్త్వం అని చెప్తుంది.

చంద్ర బింబం శిరస్సు దగ్గర భాసిస్తుంది. సిద్ధులకి సహస్రారం లో ఉన్న చంద్ర కళ స్పృహ కలుగుతుంది. యోగ తత్త్వం లోని పరిపూర్ణ దశ చెపుతుంది చంద్రశేఖర నామం.పురాణ పరం గా చంద్రుడు దక్షుడి అల్లుడు. అతని అవక తవక పని కారణంగా దక్షుడు చంద్రుడిని శపిస్తాడు. దానితో క్షయ వ్యాధి గ్రస్తుడు అవుతాడు చంద్రుడు. తన కళలు తగ్గటం మొదలు అవుతాయి. అప్పుడు చంద్రుడు శివుడి కి తపస్సు చేస్తాడు. అప్పుడు పరమేశ్వరుడు చంద్రుడి క్షయ వ్యాధి పోగొట్టి, అతనిని పరిపూర్ణురుడి ని చేసాడు. చంద్రుడు తన లో ఒక కళ ని కృతజ్ఞతగా సమర్పించుకున్నాడు. శశిశేఖర నామం శివుడి నామాలలో విశిష్ఠము అయినది.

## 6.శ్రీ వామదేవాయ నమః

వామ అనే శక్తి కలిగిన వాడు వామదేవుడు. ఈ నామం లో పది సక్తుక విశేషాలు ఉన్నాయి. వమనము అంటే వెలిగ్రక్కుట (లోపల ఉన్న శక్తి ని బయిట పెట్టుట). సర్వ జగములను ప్రకటించువాడు. సుందరమైన ఆకారం కల వాడు ( సత్యం శివమ్ సుందరం). వికారమైన ఆకారం కల వాడు (చితా భస్మం, సర్పం ధరించిన రూపం)

## 7. శ్రీ విరూపాక్షాయ నమః

విరూపమైన నేత్రములు కల వాడు. మూడు కనులు కల వాడు, అదే "వీ". లోక సామాన్యమునకు విరుద్ధముగా. పరమేశ్వరుడి మూడు నేత్రములు: చంద్ర, సూర్య,అగ్ని. త్రిపుటి తత్త్వం తెలియ చేస్తాయి మూడు కనులు (జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము). విలక్షణమైన అక్షములు కల వాడు.

## 8. శ్రీ కపర్దినే నమః

శివుడి జటాజూటము పేరు కపర్దము. జటాజూటం కలిగిన వాడు కపర్ది.

"కం పర్దయతేతి ఇతి కాపార్ధం"!: జలములను (అంటే గంగను)నియంత్రించునది. గంగాధరుడు.

## 9. శ్రీ నీల లోహితాయ నమః



నీలం, ఎరుపు (బంగారు) రంగులు కలిసి ఉన్నవాడు. నీల కంఠం జల తత్త్వం. ఎరుపు (బంగారు) వర్ణం అగ్ని తత్వానికి సంకేతం. ఈ జగత్తు "అగ్ని సోమాత్మకం". బ్రహ్మ దేవుడికి కనిపించిన రూపం ఇదే. జల తత్త్వం చల్లని అమ్మవారి సంకేతం. అగ్ని రుద్ర తత్త్వం. ఈ రెండు కలిస్తే ప్రపంచం (వేడి, చలువ). సూర్య కిరణముల యందు జల అగ్ని లక్షణ శక్తులను నీలలోహిత అంటారు.సూర్యుడు శివ స్వరూపమే కనుక ఈ నామానికి ఈ అర్ధం సరిపోతుంది .

## 10. శ్రీ శంకరాయ నమః

శివుడి నామాలలో ఇది అతి ప్రసిద్ధి అయిన నామం. మూడు నామాలు త్రిశూలం లాంటివి:

శివ/ శంభు / శంకర.

"శం" అనగా సుఖము, శాంతి, శుభము. వాటిని కలిగించేవాడు శంకరుడు. నమస్కరించినవారికి ఇవన్నీ ఇస్తాడు.

## 11. శ్రీ శూలపాణయే నమః:

రామునికి కోదండం ఎలాగో, విష్ణు కి సుదర్శనం ఎలాగో, శివుడికి త్రిశూలం అలాగ. శూలం ఒక దేవత. అప్పయ్య దీక్షుతుల వారు త్రిశూలానికి మంచి నిర్వచనం చెప్పారు :సృష్టి , స్థితి, లయ; భూత ,వర్తమానం భవిష్యత్; భూలోక, భువర్లోక, సువర్లోక;స్వర్గ, మర్త్య, పాతాళ లోకములు; మూడు కాలాలు, మూడు లోకాలు, మూడు స్థితులు , మూడు గుణాలు , మూడు కర్మలు, మూడు గా నడిచేవన్నీ ఎవరి చేతిలో ఉన్నాయో అతడే పరమేశ్వరుడు .ఇవన్నీ నాచేతిలోనే అని తెలపటానికి త్రిశూలం ధరించాడు.



info@gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose

## 12. శ్రీ ఖట్వాంగినే నమః

ఖట్వాంగం అనే ఆయుధాన్ని ధరించిన వాడు ఖట్వాంగి. ఖట్వాంగం అంటే మంచపు కోడు, కానీ మంత్రం శాస్త్రంలో కింది భాగం కర్ర లాగ, పై భాగం కపాలం (పుర్రె) లాగ ఉంటుంది అని చెప్పారు. అంటే మన వెన్ను దండం కి ఆధారం కర్ర భాగం, మన పుర్రే ఆ కపాలం. అంటే మన శరీర భాగం అయిన వెన్ను లో, కపాలం లో చైతన్యం గా ఉండు వాడు మరియు అవి ఎవరి చేతిలో ఉన్నాయో అతడే ఖట్వాంగి. (యోగ పరమైన అర్థం)

## 13. శ్రీ విష్ణు వల్లాభాయ నమః

విష్ణువుకి ప్రియమైన వాడు. శివ విష్ణు అభేదం. విష్ణువు కి అభిన్నం అయిన వాడు .ప్రతి యుగం లో విష్ణువు అవతారం ఎత్తినప్పుడు శివుడిని పూజించాడు .

## 14. శ్రీ శిపివిష్టాయ నమః

“శిపి” అంటే జీవులు/ పశువులు అని ఒక అర్థం. “విష్టహ” అంటే జీవుల యందు ప్రవేశించినవాడు. అంతర్యామి అయిన రూపుడు. శిపులు అంటే కిరణములు అని అర్థం. సూర్య కిరణములకి శిపులు అని పేరు. జలాన్ని స్వీకరించి కాంతులు ఇస్తాయి. ఆ కిరణాలతో వ్యాపించిన సౌర శక్తి “శిపివిష్టా”.



## 15. శ్రీ అంబికానాథాయ నమః

పార్వతీదేవి కి పతి అయిన వాడు. శివుడికి అవిభాజ్యమైన ఆది శక్తి అంబ. విశ్వము అంతా శక్తికి అధీనం అయితే శక్తి ఈశ్వరుడుడికి అధీనం .

## 16. శ్రీ శ్రీకంఠాయ నమః

శ్రీ అనే నామానికి చాల అర్థాలు ఉన్నాయి. ఇక్కడ శ్రీ అంటే విషము అని అర్థం. శ్రీకంఠహః అంటే విషాన్ని కంఠం లో నిగ్రహించాడు. స్వామి కారుణ్యాన్ని / భక్తుల పట్ల వాత్సల్యం తెలిపే నామం.

## 17. శ్రీ భక్తవత్సలాయ నమః

భక్తుల పట్ల వాత్సల్యం కల వాడు. వాత్సల్యం అంటే నిష్కపటమైన ప్రేమ. (తల్లి తండ్రులకి పిల్లల పైన ఉన్న ప్రేమ వాత్సల్యం).

## 18. శ్రీ భవాయ నమః

కలిగించు వాడు,ఉన్నవాడు అని అర్థం . ఎప్పుడు ఉండే వాడు భవుడు(సత్: త్రికాలాలో నశించకుండా , మార్పు లేకుండా ఉండే తత్త్వం) సర్వ జగత్తుని ఉద్భవించేవాడు భవుడు. రజో గుణాన్ని స్వీకరించి సృష్టికి కారకుడు భవుడు. రెండో అర్థం, శాశ్వతమైన ఉనికి కల వాడు. మూడో అర్థం, "భవాయ జల మూర్తయే నమః". అష్ట మూర్తులలో జల తత్త్వం శివుడు .

## 19. శ్రీ శర్వాయ నమః

సర్వ జగత్తుని ప్రళయ కాలం లో లయం చేస్తాడు. రెండో అర్థం: శితి మూర్తి అంటే భూ తత్త్వం గా ఉన్న వాడు.ఇది కూడా అష్టమూర్తి నామాలలో ఒకటి.

## 20. శ్రీ త్రిలోకేశాయ నమః

ముల్లోకములు కు ప్రభువు / మూడు లోకాలకు ఈశ్వరుడు (స్వర్గ మర్త్య పాతాళ లోకాలు).

## 21. శ్రీ శితికంఠాయ నమః

ఒక అర్థం తెల్లని కంఠం కల వాడు. నలుపు / నీల కంఠం అనే అర్థం కూడా ఉన్నది. శివుడి కంఠం సహజంగా తెలుపే, లోక రక్షణ కోసం నీలం గా మారింది.

## 22. శ్రీ శివాప్రియాయ నమః

శివా అంటే అమ్మవారు. చిచ్ఛక్తి స్వరూపమే అమ్మవారు. చిచ్ఛక్తి కి ప్రియమైన సత్ స్వరూపుడు శివుడు. పరమేశ్వరుడు అంటే సత్ చిత్ ఆనందం. సత్ అంటే ఎల్లవేళలా ఉండుట.

చిత్ అంటే చైతన్యం,ఆనందం. చైతన్యము,ఆనందము, సత్ ఒకే లక్షణములు కనుక సత్ స్వరూపుడు అయిన శివుడి చైతన్యము ఆనందము-అమ్మవారు.

## 23. శ్రీ ఉగ్రాయ నమః

ఉగ్ర తత్త్వం అష్టమూర్తులలో వాయువు ని ఆదేశించి చెప్తుంది. లోకం లో ఉగ్రుడు అంటే కోపము కల వాడు. పరమేశ్వరుడు మన్యు శక్తి తో లోకాన్ని లయం చేసుకుంటాడు

ఇంకో అర్థం :

ఎవడంటే లోకమంతా భయ పడుతుందో వాడు ఉగ్రుడు (అంటే జగత్తు, దేవతలకి శివుడంటే ఒక వినయ పూర్వకమైన భయం). ఉగ్రశాసనుడు.

ఇంకో అర్థం:

"ఉత్ గ్రసతీతి ఇతి ఉగ్రహ".

ఉత్కృష్ట స్థితికి తీసుకుని వెళ్లువాడు. అంటే మనకి ఉన్నత స్థితికీ, మోక్ష స్థితికీ తీసుకు వెళ్లేవాడు.



ఇంకో అర్థం: అన్నిటినీ మించిన వాడు/ సర్వాధికుడు / విశ్వాధికుడు.

## 24. శ్రీ కాపాలినే నమః

పరమేశ్వరుడు కపాలం ధరించి ఉంటాడు కాబట్టి కాపాలి. కపాలం కి ప్రధానమైన అర్థం యజ్ఞ పాత్ర. కపాలం పట్టుకున్న పరమేశ్వరుడు యజ్ఞ మూర్తి (వైదిక అర్థం). ఇంకో అర్థం ఎన్నో కల్పాల బ్రహ్మల కపాలం ధరించిన వాడు. నూరు కల్పాల తరవాత బ్రహ్మ గారు ముక్తి పొందుతారు. ఆ కపాలం శివుడి కపాల మాల లో చేరుతుంది. ఈ కపాల మాలకి కొలిక్కి పూస

ఉండదు. ఇంకో అర్థం లో ఒక్కపుడు బ్రహ్మ గారికి ఐదు ముఖములు వుండేవి. అబద్ధం ఆడిన సందర్భం లో శివుడు, కాలభైరవ రూపం తో ఐదో తలని గిల్లి తీసేస్తాడు. ఆ బ్రహ్మ కపాలం పడిన స్థానం బదరీ క్షేత్రం. యోగ పరంగా అర్థం: కపాలం మన శరీరం లో ప్రధానమైన స్థానం.

"సర్వ ఇన్ద్రియాణాం శిర ప్రధానం"

శరీరం అంతటికీ చైతన్యం ఇచ్చే చోటు తల/ కపాలం. జ్ఞాన ఇంద్రియ స్థానం కపాలం. జ్ఞాన ఇంద్రియ స్థానం శాస్త్ర పరిభాష లో శివ స్థానం, ఎందుకంటే శివుడు జ్ఞాన స్వరూపుడు, అందరి కపాలాలూ శివుడి చేతి లో ఉన్నాయి. అందరి కపాలం యందు జ్ఞాన రూపం గా ఉన్న వాడు కాపాలి.

## 25. శ్రీ కామారియే నమః

కాముడు అంటే మన్మధుడు. మన్మధుడికి శత్రు అయిన వాడు. లోకం మీద ప్రభావం చూపించాల్సింది పోయి లోకేశ్వరుడు మీద చూపిస్తే శివుడు కంటి మంటలో దగ్ధమైయ్యాడు. తత్త్వపరంగా శివుడు కామాది వికారాలకు శత్రువే. జ్ఞానం ఉన్న చోట కామం ఉండదు. కోరికతో శివుడిని పూజిస్తే కోరిక తీరుతుంది. కోరిక లేకుండా శివుడిని పూజిస్తే మరి జన్మ లేకుండా ఉంటుంది.

## 26. శ్రీ అంధకాసుర సూధనాయ నమః

అంధకుడు (గుడ్డి వాడు) అనే అసురుడు ని సంహరించినవాడు.

తత్త్వ పరంగా:

గుడ్డితనం అంటే అజ్ఞానం(దేనినీ చూడలేక పోవటం). అజ్ఞానమే / అవిద్యయే అసురత్వం.

## 27. శ్రీ గంగాధరాయ నమః

గంగ ను ధరించిన వాడు. ఈ నామం తలచగానే పాప నాశనం కలుగుతుంది, పవిత్రత కలుగుతుంది. భగీరథుడి తప్పస్సు కి దిగి వచ్చిన గంగ ని పరమేశ్వరుడు తన జటా జూటం లో

నియంత్రించి, గంగ వేగాన్ని తగ్గించి అప్పుడు ఈ భూమి మీద కి ప్రవహింప చేసాడు. శివుడి దయ / కారుణ్యాన్ని తెలియ చేసే లీల( అలాగే విషం మింగటం కూడా అలాంటిదే) లోక రక్షకుడు.

## 28. శ్రీ లలాటాక్షాయ నమః

లలాటము అనగా నుదురు పై కన్ను / అక్షం / నేత్రము కల వాడు. ఈ కన్ను అగ్ని నేత్రము. అందరికి ఈ కన్ను ఉంటుంది. సామాన్యులకు మూసి ఉంటుంది. యోగులకు తెరచి ఉంటుంది. ఇది జ్ఞాన నేత్రం. లోకముల లో అన్ని చూడటానికి రెండు నేత్రాలు చాలు. లోకములలోనే ఉన్న దివ్యత్వాన్ని తెలుసుకోవటానికి మూడో కన్ను / జ్ఞాన నేత్రం తెరుచుకోవాలి (యోగ పరంగా). పరమేశ్వరుడు జ్ఞాన స్వరూపం, యోగ స్వరూపం గనుకనే అగ్ని నేత్రం ధరించి ఉన్నాడు. సర్వ కర్మ లంపటాలను దగ్ధం చేసే జ్ఞాన అగ్ని నేత్రం కల వాడు. స్వామి రెండు కళ్ళు సూర్య చంద్రుల ను తెలియచేస్తే మూడో కన్ను అగ్ని కి సంకేతం. ఈ సూర్య చంద్ర అగ్ని నేత్రములు ద్వారా లోకాన్ని అనుగ్రహిస్తున్నవాడు లలాటాక్షుడు.

## 29. శ్రీ కాల కాలాయ నమః

కాలం అంటే నియతి. కాలానికి కాలం అయిన వాడు. సృష్టిలో ఒక నియమాన్ని ఏర్పరచి కాలం. ఏది ఎప్పుడు యెంత ఎలా ఎక్కడ ఉండాలి అనేది కాలానికి అధీనమై ఉంటుంది. కాలబద్ధులు ఐన వారు జీవులు. జీవులన కాలాన్ని తన చేతిలో పట్టుకున్న వాడు కాలకాలుడు. (యముడిని సంహరించిన కథ). ఈ నామం పరమేశ్వరుడి సర్వ శ్రేష్టత్వాన్ని తెలియ చేస్తుంది.

## 30. శ్రీ కృపానిధయే నమః

పరమేశ్వరుడు కృపకి నిధివంటి వాడు. నిధి అంటే తరగని సంపద. స్వామి దయ ఎన్నడూ తరగనిది. దయయే అయినా, ఈ దయని అనుభవము లోకి తెచ్చుకున్నవారు భక్తులు.



info@gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose

## 31. శ్రీ భీమాయ నమః

భీమా అంటే ఒక అర్ధం భయంకరుడు అని. ఆయన భయంకర స్వభావం కూడా దయ లో భాగమే అధర్మం పట్ల భయంకరంగా ఉంటాడు (శిక్షిస్తాడు). శాసన భయం అని వేదం పరంగా అర్ధం. ధర్మ శాసనాన్ని అతిక్రమించకూడదు అనే భయం మంచి భయం.పంచభూతాలు ఆయన శాసనాన్ని అనుసరిస్తున్నాయి.ఈ నామము కూడా శివుడి అష్టమూర్తుల నామాలో ఒకటి. భీమా అంటే ఆకాశం అని అర్ధం.

## 32. శ్రీ పరశుహస్తాయ నమః

పరశు అంటే గండ్రగొడ్డలి. శివుడి ఆయుధం కఠినమైన శాసన శక్తి కి సంకేతం. పరమేశ్వరుడి దగ్గర లేడి కూడా ఉంది (అంటే లాలించే శక్తి). శివుడి శూలము త్రిగుణాలకు సంకేతం. సత్య నిష్ఠ కి సంకేతం గండ్రగొడ్డలి. సత్యము అంటే శాశ్వతమైన నియమం. నియమానికి కట్టుబడి ఉండటమే సత్య నిష్ఠ. బ్రహ్మ అంతటి వాడినే అసత్యం ఆడినందుకు శిరం ఛేదించాడు. మొగలి పువ్వు అబద్ధం ఆడటం వల్ల శివుడి పూజకి అర్హత కోల్పోయింది. సత్యమే భగవత్ స్వరూపము.

## 33. శ్రీ మృగపాణయే నమః

స్వామి లేడిని ధరించాడు. లేడి చపలత్వానికి సంకేతం. లేడి మనసుకి సంకేతం. మనసు చంచలం గా ఉంటుంది. విషయాలు అనే అరణ్యం లో పరిగెడుతూ ఎప్పుడు ఏది ముంచుతుందో తెలియకుండా పరిగెత్తే మనసే " లేడి"/ మృగం. అలాంటి మనసుని నిగ్రహించటమే పరేమేశ్వరుడి అనుగ్రహం.

## 34. శ్రీ జటాధరాయ నమః

జడలను ధరించువాడు. శాస్త్రం ప్రకారం జటలు అంటే వేదాంతము/ సాంఖ్యము/ యోగము అనే విద్యలు. ఈ విద్యలు అన్నీ ఎవరి యందు ఉన్నాయో అతడే జటాధరుడు. "ఈశాన సర్వ విద్యానాం". ఒక జట లోంచి వీరభద్రుడు ఆవిర్భవించాడు. ఇంకో అర్ధం జటలు అంటే తీర్ధములు. పవిత్రమైన తీర్ధములు ధరించిన వాడు.



info@gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose

### 35. శ్రీ కైలాస వాసినే నమః



కైలాసము నందు వసించువాడు. పరమేశ్వరుడి దివ్య ధామం కైలాసం. భూమి యందు హిమవత్పర్వతమున మానస సరోవరం లో ఉన్నది కైలాసం అని అంటారు. అసలైన కైలాసం పద్నాలుగు ఆవరణల అవతల ఉంటుంది. కైలాసం అంటే ఆనంద ధామం. పరమేశ్వరుడు ఆనంద స్వరూపుడు. దుఃఖ స్పర్శ ఇసుమంత కూడా లేని వాడు. కేళి అంటే ఆట/ లీలలు. అది జరిగే చోటు కైలాసం. పరమేశ్వరుడి లీలలు పంచ కృత్యాలు: సృష్టి, స్థితి, సంహారం, తిరోధానం,అనుగ్రహం.ఇవి చేసే చోటు కైలాసం. వీటిని ఒక ఆట లాగ ఆనందంగా చేస్తున్నాడు.

### 36. శ్రీ కవచినే నమః

కవచము కలవాడు. అసుర సంహారం చేసినప్పుడు వీరోచితంగా కవచం ధరించి యుద్ధం చేస్తాడు. ఇంకో అర్థం కవచ స్వరూపుడు. సర్వ జీవులను కవచం లాగ కాపాడతాడు / రక్షకుడు

### 37.శ్రీ కఠోరాయ నమః

పరమాత్మ కరుణామయుడైనా, కొఠోరంగా ఉంటాడు. ధర్మం కఠోరంగా / కఠినంగా ఉంటుంది. ఆచరించటం కఠినమే. ఫలం మాత్రం మృదువుగా ఉంటుంది. లోక పాలకుడైన పరమేశ్వరుడు ధర్మాన్ని రక్షించటానికి అధర్మాన్ని కఠోరంగా శిక్షించాలి. జగత్తు లో రెండూ అవసరమే. రాయి / ఎముకలు కఠోరంగా ఉండటం మూలంగా వాటి ప్రయోజనం వాటికి ఉన్నాయి.మట్టి / మధ్య / మాంసము మృదువుగా ఉండటం వలన దాని ప్రయోజనం వేరు.

ఇంకో అర్థం:

పరిపూర్ణత.

## 38. శ్రీ త్రిపురాంతకాయ నమః

శ్రీశైల తూర్పు ద్వారాన్ని త్రిపురాంతక ద్వారం అంటారు. త్రిపురాసురులను సంహరించిన వాడు. వేదంలో ఈ కథ చెప్పబడింది. కమలాక్షుడు, విద్యున్మాలి, తారకాసురుడు అనే అసురులను సంహరించాడు. వీరు మూడు పట్టణాలు (స్వర్ణ/ రజత/ అయోమయం (ఇనుము)) లో తిరుగుతూ ఉంటారు. ఇవి సత్వ,రజస్ ,తమో గుణాలకు ప్రతీక . వీటిని వేసుకుని తిరిగే జీవులే ఈ అసురులు (త్రిపురాసురులు). జ్ఞానం తో వీటిని జయించటమే త్రిపురాసుర సంహారం. అలాగే స్థూల సూక్ష్మ కారణ శరీరాలు నేను అనే అజ్ఞానాన్ని తొలగించటమే త్రిపురాసుర సంహారం. త్రిగుణాతీత స్థితి దాటి సమాధి స్థితి కి తీసుకుని వెళ్లటమే త్రిపురాంతకాయ నమః ఇది తాత్త్విక అర్థం.

## 39. శ్రీ వృషాంకాయ నమః

అంకము అనగా గుర్తు / చిహ్నము. వృషభాన్ని గుర్తు గా కలవాడు.స్వామి ధ్వజం పై వృషభం ఉంటుంది. పరమేశ్వరుడిని తెలియ చేసేది వృషభం.

సంకేత అర్థం:

వృషభం ధర్మానికి ప్రతీక. ధర్మమే పరమేశ్వరుడి స్వరూపం.

## 40. శ్రీ వృషభారూఢాయ నమః

వృషభం పై అధిష్టించి ఉంటాడు, అంటే ధర్మం పై ఉంటాడు, అందుకే ముందు వృషభానికి నమస్కరించిన తరవాత పరమేశ్వరుడికి నమస్కారం. నందిని దర్శించనిదే పరమాత్మ ని దర్శించ రాదు అంటే ధర్మం తోనే పరమాత్మ ని చూడగగలము.

## 41. శ్రీ భస్మోద్ధూళిత విగ్రహాయ నమః

భస్మమును ధరించిన స్వామి. "ఉద్ధులన"ఒకానొక ప్రక్రియ. స్వామి ప్రధానమైన అవ్యయా స్థానములయందు భస్మం ధరిస్తాడు. భస్మం ధరించిన దివ్య మంగళ విగ్రహం. భస్మం యజ్ఞ

సంస్కారాన్ని తెలియ చేస్తున్నది. భస్మం యజ్ఞ (అగ్ని) ప్రసాదం / యజ్ఞ తత్త్వ సారం, అగ్ని ఫలం ఐశ్వర్యం. అగ్ని ధరించలేము కాబట్టి భస్మం ధరిస్తాము.

"భూతిర్ విభూతిర్ ఐశ్వర్యం"!

ప్రకాశ స్వరూపం / వర్చస్సు(భాసనాత్) పెరుగుతుంది.

"భస్మ కీళ్బిష భక్షణం"

పాపములను తగలపెడుతుంది. భస్మం ధరించిన వారికి పవిత్రత, ఐశ్వర్యము పాప సంహారం,రక్షణ అనే ప్రయోజనాలు ఉన్నాయి. భస్మం ధరించకుండా శివ పూజ ఫలితం లేదు. భస్మము జ్ఞానానికి సంకేతం.

"జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం"!

## 42. శ్రీ సామప్రియాయ నమః

సామమునందు ప్రీతి కలవాడు. వేదములలో మూడు భాగములు ఉన్నాయి: ***ఋక్కులు యజుస్సులు సామములు***. ఋక్కులు శ్లోక రూపములో భగవంతుడిని స్తుతిస్తూ ఉంటాయి. యజుస్సులు గద్య రూపములో స్తుతిస్తాయి. ఋక్కులలో ఉన్న వాటిని స్వర సహితం గా చెప్తే సామములు అంటారు.దేవతలను ప్రసన్నం చేసుకోవాలి అంటే నాదం తో కూడిన స్వర సంహితమైన స్తుతులు చాల అవసరం .భగవంతుడు సామగాన లోలుడు.

ఇంకో అర్థం:

సౌమ్యమే సామము (సామ, దాన,భేద దండోపాయాలు ). శాంతముగా మధురముగా భాషించటమే సామము. శివ భక్తులు కు ప్రత్యేకంగా ఉండవలసి అది. మాట సామముగా, ప్రసన్నంగా ఉంచుకోవటం, మాట లో చల్లదనం (చందనం లాగ), తీపిదనం (అమృత తత్త్వం, భగవతుడిగురించి మాటలే తీపి/ అమృత తత్త్వం తో కూడినవి) ఉన్న వాడు శివ లోకం పొందుతాడు.



info@gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose

## 43. శ్రీ స్వరమయాయ నమః

శివుడు స్వర ప్రియుడు. సప్త స్వరములు శివ మయమే / శివుడి నుండే వచ్చాయి, శివ స్వరూపములే. (దీపం నుండి వచ్చిన కాంతులు దీప స్వరూపములే). త్యాగరాజు గారికి ఈ రహస్యం తెలుసు, అందుకే శివుడి ఐదు ముఖములలోంచి సప్త స్వరాలూ వచ్చాయి అని అన్నారు.

ఇంకో అర్థం:

ఓంకారమే స్వరం. వేదానికి ఆది అంతములో చెప్పే స్వరమే ఓంకారం. స్వరమయః అంటే ప్రణవ మూర్తి / ఓంకార మూర్తి. వేదం స్వరం కాబట్టి శివుడు వేదస్వరూపుడు.

"వేదః శివః శివో"!

## 44. శ్రీ త్రయీమూర్తయే నమః

త్రయీమూర్తి అంటే వేదమూర్తి. పరమేశ్వరుడి ఊపిరులే వేదం. నాలుగు వేదాలు ఋక్కులు యజుస్సులు సామములతో ఉంటాయి కనుక "త్రయీ". వేదమంత్రాలలో మూడు రకాల అర్థాలు ఉంటాయి:

ఆది దైవిక,

ఆది భౌతిక,

ఆధ్యాత్మిక.

## 45. శ్రీ అనీశ్వరాయ నమః

ఈశ్వరుడు (ప్రభు/ శాసకుడు) అవసరం లేని వాడు. పరమాత్మ సర్వోత్కృష్టమైన వాడు. అతని పైన ఏమి లేదు / ఎవరి శాసనము లేదు. మహేశ్వర నామానికి ఈ నామానికి ఒకే భావం.

## 46. శ్రీ సర్వజ్ఞాయ నమః

"సర్వజ్ఞుడు అని చెల్లు పరమేశ్వరునికి"!. సర్వ కాల సర్వ దేశ సర్వవస్తు జ్ఞానం పరమేశ్వరుడిదే. అణువు నుంచి బ్రహ్మాం వరకు సర్వ జ్ఞానములు ఆయనవే.

ఇంకో అర్థం:

బ్రహ్మవేత్త, అంటే, సర్వం బ్రహ్మము అనే జ్ఞానం కలిగిన వాడు సర్వజ్ఞుడే

"ఈశాన సర్వ విద్యానాం, ఈశ్వర సర్వ భూతానాం"!

## 47. శ్రీ పరమాత్మనే నమః

"పరమ" అంటే ఉత్కృష్ట. ఆత్మ అంటే "ఆతనోతి వ్యాప్నోతి ఇతి ఆత్మా" అన్నిటికంటే ఉత్కృష్టమై వ్యాపించిన వాడు కనుక "పరమాత్మ" చైతన్యం ఎక్కడ ఉంటే దాన్ని ఆత్మ అనాలి. చైతన్యం ఆత్మ యొక్క లక్షణం. అజ్ఞానం చేత ఈ దేహమే ఆత్మ అని అనుకుంటాము. కొంచెం ఆలోచిస్తే దేహం జడమైనది, దేహానికి చైతన్యం ఇచ్చేది ఆత్మ. బుద్ధి, ప్రాణములు,మనస్సు,కూడా "ఆత్మ" కావు. వీటన్నిటికీ పైన ఉన్నది ""ఆత్మ". దేహ ప్రాణ మనో బుద్ధులకు అతీతమైన వాడు "పరమాత్మ". వీటన్నిటికీ చైతన్యం ఇచ్చువాడు, తనకి తానే స్వయంప్రకాశ స్వరూపుడు "పరమాత్మ".

## 48. శ్రీ సోమసూర్యాగ్ని లోచనాయ నమః

స్వామికి మూడు నేత్రములు: సోమ (చంద్రుడు), సూర్య, అగ్ని. మహాభారతం అనుశాసనిక పర్వం లో ఒక మాట ఉంది "ఈ మూడు నేత్రములు ఉన్న వాడిని ధ్యానిస్తే శాంతి కలుగుతుంది". సృష్టి అంతటికి శక్తిని ఇచ్చేది ఈ మూడే.

ఇంకో అర్థం:

చంద్రుడు మనస్సుకి అధిపతి. సూర్యుడు బుద్ధికి, దృష్టికి అధిపతి. అగ్ని వాక్కుకి అధిపతి. మనకు ఉన్న త్రికరణాలు (శరీరానికి ఉన్న మనస్సు, వాక్కు, బుద్ధి / దృష్టి) ఎవరి వల్ల పని చేస్తున్నాయో అతడే సోమసూర్య అగ్ని లోచనుడు.

## 49.శ్రీ హవిషే నమః

## 50. శ్రీ యజ్ఞమయాయ నమః

(ఇది యజ్ఞ పరమైన నామం) హవి అంటే యజ్ఞ ద్రవ్యము. యజ్ఞంలో హోమం చేసే ద్రవ్యాన్ని హవిస్సు అంటారు. యజ్ఞం అంతా శివ స్వరూపము. "యజ్ఞం"లో ఉండేవి :

యజ్ఞము

మంత్రము

దేవత

క్రియ (ప్రక్రియ)

ద్రవ్యము(అంటే హోమములో వేసే పదార్థాలు )

ఫలము

ఇవన్నీ శివ స్వరూపములే. ఆయన యజ్ఞ ప్రభువు. అష్టమూర్తులలో "యజమానమూర్తి" అనే నామం ఉంది. యజ్ఞం అంటే త్యాగ పూర్వకమైన కర్మ. ఏమీ ఆశించకుండా జగత్ రక్షణ కోసం చేసే పని, ఒక ప్రక్రియ.

## 51. శ్రీ సోమాయ నమః

ఇది కూడా యజ్ఞ పరమైన నామమే. సోమలత నుండి తీసే రసం పేరు సోమా.

యోగ పరంగా:

మన శరీరములో సుషుమ్న నాడియే సోమలత. దాని లో ప్రసరించే రసమే సోమరసం (చిదేకరస రూపిణి). దాన్ని గ్రహించటమే యజ్ఞం చెయ్యటం. దాన్ని గ్రహించిన వాడే నిజమైన "సోమయాజి ".

<u>తాత్త్విక నిర్వచనం:</u>

సహస్రారం లో శివశక్తి రూపమును ఎవరు ఆస్వాదిస్తారో, బ్రహ్మానందాన్ని ఆస్వాదిస్తాడో, వాడే యోగి/ సోమయాజి.

<u>మూడు అర్ధాలు:</u>

యజ్ఞములో వేసే ద్రవ్యము,

యోగములో సుషుమ్న నాడి లో ప్రసరించే రసము,

తత్త్వ పరంగా సహస్రారములో బ్రహ్మానందం.

<u>నాలుగో అర్ధం:</u>

స + ఉమా = సోమా

ఉమా దేవి తో కుడి ఉన్నవాడు. ఉమా సహితముగా చంద్రరేఖ ధరించిన శివుడిని ఆరాధిస్తే మోక్ష ప్రాప్తి కి హేతువు అని కైవల్యోపనిషద్ చెప్తుంది.

<u>ఐదో అర్ధం:</u>

సోమా అంటే చంద్రుడు. శివుడు చంద్ర రూపుడు (చంద్రమూర్తి). బాహ్యంగా కనపడే చంద్రుడే కాదు సహస్రారం లో ఉన్న బిందు రూపుడు నిజమైన చంద్రరూపుడు.



info@gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose

## 52. శ్రీ పంచవక్త్రాయ నమః



**శివుడి ఐదు ముఖములు:**

సద్యోజాత

వామదేవ

అఘోర

తత్పురుష

ఈశాన

ఈ నామం చాల మహిమాన్వితమైనది. ప్రపంచం (ప్ర పంచం) లో ఉన్నవి ఐదే. మనము ముఖము తోనే ప్రపంచాన్ని చూస్తాం/ అనుభవిస్తాం. పరమాత్మ పంచ ముఖాల తో ప్రపంచాన్ని గమనిస్తాడు / పంచ ముఖాలు ఉన్న ప్రపంచం పరమేశ్వరునిదే.

పంచ భూతాలు

పంచ తన్మాత్రలు

పంచ జ్ఞానేంద్రియాలు

పంచ కర్మేంద్రియాలు

పంచ ప్రాణాలు

ఈ ఐదింటిని తెలియ చేసేది పంచ వదనాలు (ముఖాలు). పరమేశ్వరుడిని ఈ పంచ ముఖ రూపం తో ధ్యానిస్తే వారికి ఈ ఐదు సుముఖంగా ఉంటాయి, శాంతిని కలిగిస్తాయి. ఒకొక్క ముఖము ఒకకొక్క దిక్కు వైపు ఉంటుంది.

తూర్పు: తత్పురుష

దక్షిణం: అఘోర

పశ్చిమం: సద్యోజాత

ఉత్తరం: వామ

పైకి: ఈశాన

ఆగమాల ప్రకారంగా అన్ని మంత్రములకు శివుడే మూలం. అన్నీ శివుని ముఖములలోంచి వచ్చినవి. వీటినే ఆమ్నాయ మంత్రములు అంటారు:

పూర్వ ఆమ్నాయ

దక్షిణ ఆమ్నాయ

పశ్చిమ ఆమ్నాయ

ఉత్తర ఆమ్నాయ

ఊర్ధ్వ ఆమ్నాయ

ఏ మంత్రము చెప్పినా ఈ ఐదు లోనే ఉంటుంది. సర్వ మంత్రం రూపుడు పరమేశ్వరుడు

## 53. శ్రీ సదాశివాయ నమః

శుద్ధ బ్రహ్మమును తెలియ చేసే తత్త్వం. శివమ్ అంటే:

**త్రిగుణాతీతః శివః**

త్రిగుణములకు అతీతం ఐన వాడు. ఈ స్థితి ఎల్లవేళలా ఉండేది (సదా శివమ్). శాస్వతంగా శివత్వం.

## 54. శ్రీ విశ్వేశ్వరాయ నమః

విశ్వేశ్వర అనగానే గుర్తు వచ్చేది కాశి క్షేత్రం లో ఉన్న విశ్వనాథుడు. ఇది ప్రధాన జ్యోతిర్లింగం (ఆది జ్యోతిర్లింగం). శక్తి పీఠం కూడా. "**శివమ్ అచ్యుతం పతిం విశ్వస్య**" - సమస్త విశ్వానికీ ఈశ్వరుడు విశ్వేశ్వరుడు.

## 55. శ్రీ వీరభద్రాయ నమః

దక్ష యజ్ఞం ధ్వంసం చెయ్యటానికి శివుడి తేజస్సు వీర భద్ర రూపం ధరించింది. శివుడూ వీరభద్రుడూ వేరు కాదు. ఈ రూపం దేవతలను కూడా శిక్షించే రూపం. మనం ధర్మం తప్పితే దేవతలు శిక్షిస్తారు. దేవతలు ధర్మం తప్పితే దేవదేవుడు/ మహాదేవుడు అయిన శివుడు శిక్షిస్తాడు.

**"శ్రీ వీరభద్రాయ నమః శివాయ"**

సర్వులు జపించే మహా మంత్రం, రక్షణ లభిస్తుంది. శరభ లాంటి మూర్తులకు మూలం వీరభద్ర మూర్తే. స్వామి ఉగ్ర మూర్తులకి మూలమైన వాడు వీరభద్రుడు. ఉగ్ర మూర్తులు జగత్ రక్షణ/ మనకి అభయం ఇవ్వటం కోసం వచ్చిన మూర్తులు. వీరభద్ర నామం లో వీరత్వము భద్రత్వమూ, రెండూ ఉన్నాయి, అంటే పరాక్రమం తో పాటు క్షేమం కలిగించే స్వభావం. ఆయన పరాక్రమం  ప్రపంచ క్షేమం కోసం. ఈ నామం లో శివుడి రక్షణ తత్త్వం దాగి ఉంది.

## 56. శ్రీ గణనాథాయ నమః

గణపతి సాక్షాత్తు శివుడి స్వరూపమే.

**"ఆత్మావై పుత్ర నామాసి"!**

ఇంకో అర్థం:

స్వామి వద్ద గణములు (ప్రమథ గణములు) ఉన్నాయి. మహాభారతం లో కృష్ణ పరమాత్మ చెప్పాడు ఈ ప్రమథగణాలలో కొన్ని ఘోర, కొన్ని అఘోర మరి కొన్ని ఘోరాఘోర మూర్తులు ఉన్నాయి. ఈ ప్రమథగణాలు ఏమైనా చెయ్య గలవు. వారిని అడిగేవారు లేరు. వీరు లోకాలలో రకరకాల మార్పులు చేస్తారు (ప్రమథనం అంటే మార్పు చేయుట)

**"సర్వే కామ కరః సిద్ధహా"**

ఈశ్వరుడి శాసక శక్తులే ప్రమథులు. వీరిని శాసించేవాడే పరమేశ్వరుడు.

ఇంకో అర్థం:

విశ్వాన్ని నడిపే దేవతలు మూడు రూపాలలో ఉటారు:

వసు గణములు (ఎనిమిది)

రుద్ర గణములు (పదకొండు)

ఆదిత్య గణములు (పన్నెండు)

ఈ గణములకు పతి కనుక "గణనాధా" అని స్తుతిస్తున్నాము. గణేశ్వరుడు విశ్వేశ్వరుడూ ఆయనే.

57. **శ్రీ ప్రజాపతయే నమః**

ప్రజలు అంటే జీవులు. జీవులకు ప్రభువు కనుక ప్రజాపతి. ఈ నాలుగు నామాలు - "విశ్వేశ్వర, వీరభద్ర, గణనాధా, ప్రజాపతి"ప్రపంచాన్ని నడిపే వాడు అతడే (శివుడే) అని తెలియచేస్తున్నాయి. ప్రజాపతి అంటే బ్రహ్మదేవుడు అని అర్థం కూడా ఉన్నది. బ్రహ్మ దేవుడి లో సృష్టి చేసే శక్తి శివుడే. అందుకే సృష్టి కర్త రూపముగా ఉన్న వాడు అని ఒక అర్థం జగత్తుకి తండ్రి అయినవాడు.

58. **శ్రీ హిరణ్యరేతసే నమః**

హిరణ్యము అంటే తేజస్సు. సూర్య మండలం అందు ఉన్న తేజస్సు హిరణ్యము. ప్రపంచానికి మూలమైన తేజస్సు హిరణ్యము. హితము రమ్యము (హిరణ్యము) కలిగించే తేజస్సు. కరగ పెట్టిన బంగారం వంటి స్వరూపం (బంగారం ని హిరణ్మయం అంటారు). రేతస్సు అంటే సృష్టి కారకమైన బీజం. సృష్టి కి కారణమైన బీజాలు కలిగిన వాడు, తండ్రి, అందుకే మహాలింగం అని అంటారు.

భగవద్గీత లోన ఇదే విషయాన్ని తెలియచేసే శ్లోకం:

**"తేషామ్బ్రహ్మ మహద్యోనిర్**



info@gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose

**అహం బీజ -ప్రదః పితా"**

ప్రకృతి అనే యోని లో సృష్టికి కావలసిన బీజాలను నిక్షిప్తం చేసిన వాడు.

59. **శ్రీ దుర్ధర్షాయ నమః**

ఎవరూ ఎదుర్కొనలేని వాడు అని అర్థం. స్వామి తో సమానమైనది లేదు, అధికమైనది లేదు.

ఇంకో అర్థం:

మనలో ఆత్మ రూపంగా ఉన్న వాడు. ఆత్మని ఎవరు తగలపెట్టలేరు, తడపలేరు, ముక్కలు చెయ్యలేరు. అసుర సంహారం లో శివుడికి ఓటమి లేదు.

60. **శ్రీ గిరీశాయ నమః**

పర్వతములకు అధిపతి. పర్వతములు సువ రూపములు (అరుణాచలం, శ్రీ శైలం, వింధ్య). పర్వతం అంటే అన్నిటికంటే ఉన్నతం అయినది. ఎంతో కష్ట పడితే గాని ఎక్కలేము. గిరులకు ప్రభువు.

61. **శ్రీ గిరిశాయ నమః**

గిరులందు ఉండు వాడు. సిస్టర్ నివేదిత కి హిమవత్పర్వతాలు శివుడి వలె కనపడ్డాయి, మంచు విభూతిగా, ఆకుపచ్చని చెట్లు (హరికేశాయ) శివుడి జటాజూటం లా, నదులు గంగాధరుడి లాగ. వేదం ప్రకారం గిరులు అంటే వాక్కులు / స్తోత్రములు. వాక్కులలో ఉండు వాడు. వేదవాక్కులే గిరులు. వేదవాక్కుల చే ప్రతిపాదించు వాడు.

62. **శ్రీ అనఘాయ నమః**

అఘము అంటే పాపము, దోషము, దుఃఖము. అనఘము అంటే ఈ మూడు లేని వాడు. "సిద్ధం అపాప విద్ధం" (ఉపనిషత్ వాక్యం).

## 63. శ్రీ భుజంగభూషణాయ నమః

సర్ప భూషితుడై ప్రకాశిస్తున్నాడు. ఈ సర్పములు దేవతా సర్పములు (అనంత, వాసుకి, తక్షక, కర్కోటక, శంఖ, కుళిక, పద్మ, మహాపద్మ). ఈ ఎనిమిది నాగ కులానికి చెందిన సర్పములను ధరించి ఉన్నవాడు. ఈ సర్పములు యోగ రూపాలు. యోగులు / యోగ శక్తులే నాగులు. ఇవి ఈశ్వరుని ఆశ్రయించుకుని ఉన్నాయి.

## 64. శ్రీ భర్గాయ నమః

భర్గా అంటే తేజస్సు స్వరూపం అని అర్ధం. తగలపెట్టే తేజస్సు ని "భర్గా" అంటారు. అంటే పాపాలని, దోషాలని తగలపెట్టే తేజస్సు. ఈ తేజస్సు సూర్యమండలం లో ఉన్నది. దానిని ఉపాసించి శక్తిని పొందుతాము. నిరంతర దహించే తేజస్ శక్తి.

**"భర్గో దేవస్య ధీమహి"**

ఆ తేజస్సు ని గాయత్రీ గా ఉపాసన చేస్తాము. గాయత్రీ తత్త్వం ద్వారా సూర్యమండలం లో ఉన్న శివ స్వరూపమే గోచరిస్తుంది. సూర్యమండలవర్తి.

## 65. శ్రీ గిరిధన్వనే నమః

పర్వతమునే ధనుస్సు గా కలవాడు (త్రిపురాసుర సంహార లీల). మేరు పర్వతాన్ని ధనుస్సు గా తీసుకున్నాడు. ఉపనిషత్ ఆధారం గా

ఓంకారాన్ని ధనస్సుగా తీసుకున్నవాడు.

"ప్రణవో ధనువు"

బుద్ధిని దానితో అనుసంధానం చేసి అజ్ఞానాన్ని పోగొడతాడు.

## 66. శ్రీ గిరిప్రియాయ నమః

పర్వతములు/ వేదవాక్కులు అంటే ప్రీతి కలవాడు.

## 67. శ్రీ కృత్తివాససే నమః

కృత్తి అంటే చర్మము అని అర్ధం. కృత్తివాససడు అంటే చర్మమును వస్త్రముగా ధరించిన వాడు. గజాసుర సంహారం చేసి గజాసురుడి కోరికపై గజ చర్మాన్ని ధరించాడు. అలాగే దారుకావనం లో అనేక ఋషులు శివ తత్త్వం తెలుసుకోక ఆభిచారక హోమం లోంచి పులిని సృష్టించి స్వామి పై వదిలారు. స్వామి ఆ పులిని సంహరించి దాని చర్మాన్ని వస్త్రము గా ధరించాడు. చర్మాంబర దారియే కృత్తివాసుడు.

## 68. శ్రీ పురారాతయే నమః

పురములకు శత్రువు ఐనవాడు. పురములు అనగా త్రిపురములు. త్రిపురాసురులు: కమలాక్షుడు, విద్యున్మాలి, తారాకాక్షుడు. ఈ అసురులు మాయ పట్టణాలతో తిరుగుతూ ఉంటే వారిని వారి పట్టాణాలని ఛేదించాడు శివుడు. త్రిపురములు అంటే మన స్థూల, సూక్ష్మ, కారణ శరీరములు. ఈ మూడింటిని ఛేదించటమే పురారాతి. మనం అందరం త్రిపురాసురములమే. ఈ త్రిపురములలో తాదాత్మ్యం చెంది ఉండే భావనలే త్రిపురాసురులు. ఈ భావం పోవాలి. అది ఈశ్వరుడి అనుగ్రహం ఉంటేనే పోతుంది.

ఇంకో అర్ధం:

పురములు,పురముల యందు ఉన్న వాడు. దేహాత్మ భ్రాంతియే అజ్ఞానం. దేహాత్మా భ్రాంతికి విరుద్ధమై అసలైన జ్ఞానం అయి ఉన్నవాడు పురారాతి.

## 69. శ్రీ భగవతే నమః

భగము కల వాడు భగవానుడు. భగము అంటే ఐశ్వర్యము జ్ఞానము. సర్వ ఐశ్వర్యములు సర్వ జ్ఞానము ఎవరి వద్ద ఉన్నాయో వాడే భగవానుడు.

ఇంకో అర్ధం:

నిరంతరమూ వృద్ధి చెందే లక్షణం ఉన్నది భగము, అంటే ప్రకృతి ఎవరి అధీనం లో ఉందో వాడు భగవానుడు. సర్వ జీవులు ప్రకృతికి అధీనం. ప్రకృతి పరమాత్మకు అధీనం. ప్రకృతి ద్వారా

మనకి భోగములు లభిస్తున్నవి. భోగము అనగా అనుభవము. జీవులు వారు చేసుకున్న పూర్వ కర్మలను అనుభవించటమే భోగము. కర్మానుభవమే జీవితము. భోగము ఏది ఇస్తుందో అది భగము. సుఖదుఃఖాలు ప్రకృతి ద్వారా అనుభవిస్తాము కనుక ప్రకృతికి భగము అని పేరు. భగవానుడు జీవులకు వారి వారి కర్మకు అనుగుణంగా సుఖ దుఃఖాలకు భోగము అనే రూపము లో ప్రకృతి ద్వారా ఇస్తాడు. ప్రకృతి అనే భగానికి ప్రభువయినవాడు భగవానుడు.

### 70. శ్రీ ప్రమదాధిపాయ నమః

ప్రమథులు పరమేశ్వరుడి శక్తులు. ఈ ప్రమథులు ప్రపంచం అంతటా వ్యాపించి ఉంటారు. ప్రమథులకి అధిపతి శివుడు.

### 71. శ్రీ మృత్యుంజయాయ నమః

శివుడి అనుగ్రహం తెలియ చేసే నామం ఇది. మృత్యువుని తొలగించువాడు మృత్యుంజయుడు. ఈ నామం పరమేశ్వరుడి అమృత తత్త్వాన్ని తెలియ చేస్తుంది. శివుడికి అమృతేశ్వరుడు అనే పేరు ఉన్నది. అమృతమే స్వరూపముగా కలిగిన ఈశ్వరుడు. ఎవరు శాశ్వతుడో వాడే మృత్యువుని పోగొట్టగలడు. ప్రళయ కాలంలో కూడా నశించని తత్త్వమే శివుడు "శాశ్వతగుమ్ శివమ్ అచ్యుతం". శివుడిని ఆశ్రయించిన వారికి అకాల మృత్యు అపమృత్యువులు తొలగిస్తాడు. చివరికి అజ్ఞానం అనే మృత్యువుని తొలగిస్తాడు అందుకు మృత్యుంజయుడు. తాత్వికంగా, మన అసలు స్వరూపము తెలుసుకోలేకపోవటమే అజ్ఞానం అనే మృత్యువు. బ్రహ్మ జ్ఞానం లేకుండా ప్రాపంచిక జ్ఞానం ఉండటమే మృత్యువు. అలాంటి అజ్ఞానాన్ని తొలగించేవాడు మృత్యుంజయుడు.

మూడు అర్థాలు ఉన్నాయి:

అకాల అపమృత్యువు తొలగించువాడు, అజ్ఞానం తొలగించువాడు, శాశ్వతమైన వాడు.

### 72. శ్రీ సూక్ష్మతమాయ నమః / శ్రీ సూక్ష్మతనవే నమః

స్వామి సూక్ష్మ శరీరం కలవాడు. సూక్ష్మము అంటే ఇంద్రియాల తో పట్టుకోలేనిది. ఆకాశం సూక్ష్మం అంటే అపరిమితం సర్వ వ్యాపకం అయినది, ఇంద్రియాలతో పట్టుకోలేనిది. పరమేశ్వర స్వరూపం ధ్యానించగలం, స్మరించగలం, వర్ణించగలం కానీ గ్రహించలేము. **"అగ్రాహ్యాహ"!**

గ్రహించటానికి మనసుకో మాటకో అందాలి. వీటికి దొరకడు (అపరిమితుడు, అనంతుడు). ఇంద్రియాతీతము భగవంతుడి స్వరూపము.

## 73. శ్రీ జగద్వ్యాపినే నమః

పరమేశ్వరుడు జగత్ అంతా వ్యాపించి ఉన్నాడు, తల్లి, తండ్రి, గురువై శాసిస్తున్నాడు.

## 74. శ్రీ జగద్గురవే నమః



గురువు అంటే ఈ ముగ్గురే: తల్లి,తండ్రి ,ఆచార్యుడు. ఈ మూడు తానై పోషిస్తున్నాడు గనుక "గురువు". జ్ఞానం బోధించి బుద్ధులను ప్రేరేపిస్తున్నాడు గనుక ఆచార్యుడు. సర్వ జగత్ లో ఆరాధింపబడే వాడు కనుక ""జగద్గురు". శివుడు దక్షిణామూర్తి స్వరూపం గా భావించాలి. దక్షిణామూర్తి స్వరూపాన్ని తెలిపే వారు అందరు కూడా జగద్గురువులే, అంటే ఆదిశంకరులు మున్నగు వారు.

## 75. శ్రీ వ్యోమకేశాయ నమః

వ్యోమము అనగా ఆకాశము. ఆకాశమే తన కేశములుగా కలవాడు

**"ఆకాశకేశపాశధారి"**

"రోదశీ రుద్ర పత్ని" అంటేపాతాళం నుంచి అంతరిక్షం వరకు ఉన్న ప్రదేశాన్ని " రోదసి" అంటారు.

## 76. శ్రీ మహాసేన జనకాయ నమః

మహాసేనజనక అంటే సుబ్రహ్మణ్యుడి తండ్రి అని అర్థం. దేవతలసేన కి నాయకుడు సుబ్రహ్మణ్యుడు.

## 77. శ్రీ చారువిక్రమాయ నమః

ఆనందం కలిగించే విక్రమము పరమేశ్వరుడి దగ్గర ఉంది. అసుర సంహారం (అంధకాసురుడు, త్రిపురాసురుడు) అప్పుడు పరమేశ్వరుడి విక్రమత్వం బైట పడుతుంది. ఈ గాధలు తలంచుకుంటే ఆనందం కలిగిస్తాయి, పాపములు తొలగి అభీష్టసిద్ధి కలిగిస్తాయి.

## 78. శ్రీ రుద్రాయ నమః

రుద్రాయ అగ్ని మూర్తయే నమః. ప్రళయ కాలం లో అందరినీ ఏడిపిస్తాడు (రోదనము ) కనుక "రుద్రుడు".

**"రోద ఇతి సర్వం అంత కాలే ఇతి రుద్రహ"**

వైదిక పరంగా:

"ఋత్తుని ద్రవింప చేయు వాడు రుద్రుడు". "ఋత్తు" అంటే దుఃఖము దుఃఖ కారకము (శివ పురాణం). ఏడుపుతో పోగొట్టే వాడు. అంటే శిక్షించే వాడూ శిక్ష పోగొట్టే వాడూ శివుడే.

ఇంకో అర్ధం:

**"రుజామ్ ద్రవయతి ఇతి రుద్రహ"**

రోగములను పోగొట్టు వాడు

ఇంకో అర్ధం:

**"రుదంతే నాదంతే ద్రవాయతి ఇతి రుద్రహ"**

నాదోపాసనలో చివరికి లభించువాడు రుద్రుడు. నాదం యొక్క చివరిలో అమృత రూపం గా లభించే వాడు రుద్రుడు.

ఇంకో అర్ధం ఋగ్వేదం లో:

తొందరగా అనుగ్రహించే దైవం రుద్రుడు.

## 79. శ్రీ భూతపతయే నమః

సమస్త భూతములకు ప్రభువు అయినవాడు. భూతములు అంటే సృష్టిలో ఉన్నవి, కలిగేవి.

**"భూతాత్మ భూతభావనః"!**

భూతములు అంటే ప్రాణికోట్లు, బ్రహ్మ మొదలు చీమ వరకు కూడా భూతములే. దేవజాతి భూతములు కూడా ఉన్నాయి.

## 80. శ్రీ స్థాణవే నమః

స్థాణువు అంటే కదలకుండా ఉండు వాడు. నిశ్చలంగా ఉండే వాడు స్థాణువు. ఈశ్వరుడు అచలుడు / కదలకుండా ఉండువాడు. ఆయనంత కదిలేవాడు లేడు ( నటరాజు గా నాట్యం చేసినప్పుడు ) /కదలనివాడు లేడు. వేదం ఆయన కదలలేదు లేక కదిలాడు , అని చెప్పలేము అంటుంది . జగత్తు రూపములో కదులుతున్నట్టు ఉన్నాడు కానీ ఏమాత్రం కదలడు .. ఇదే ఆత్మ తత్త్వం. శుద్ధమైన వాడు,శాశ్వతంగా ఉండు వాడు, కదలనివాడు , ఏ మార్పులేని తేజస్సు కలిగిన వాడు.

## 81. శ్రీ అహిర్బుధ్న్యాయ నమః

"బుధ్న్య" అంటే మూలము అని అర్ధం. అహిర్బుధ్న్య అంటే మూలమున ఉన్న సర్పము. పాతాళ లోకం సమస్త విశ్వానికి మూలం. అంటే పాతాళ లోకములో ఆదిశేషుగా ఉన్న వాడు. భూమికి మూలమైన ఆదిశేషువునే ధరిస్తాడు. ఇది సంకర్షణ స్వరూపము. సంకర్షణ స్వరూపములో ఆదిశేషుడుగా ఉన్నవాడు.

ఇంకో అర్థం:

అహిర్బుధ్న్య అంటే అగ్ని దేవుడు. అగ్ని యొక్క మూలం క్రిందినుంచి వస్తుంది.

ఇంకో అర్థం:



info@gurujnanam.org

Disclaimer: This document is not for commercial purpose

మూలాధారం నుంచి పైకి లేచిన సర్పము. అంటే కుండలిని శక్తి (యోగ పరంగా).

## 82. శ్రీ దిగంబరాయ నమః

దిగంబరుడు అంటే వస్త్ర రహితుడు. అవధూతలు వస్త్ర రహితంగా ఉండటం అనేది ఉంది. (శ్రీ పాద వల్లభ దిగంబర అని దత్తాత్రేయ స్వామి ని అంటారు). అంటే మహాత్ములకు ఉండే శరీరమే తాము కాము అనే స్థితి.

శరీరం "నేను" అనే అజ్ఞానం లేని వారు. శివుడికి అవధూత అవతారం ఉంది. బృహస్పతి, ఇంద్రుడు, ఈ రూపం దర్శించారు.దత్తాత్రేయ రూపములతో ఉన్న వాడు అని ఒక అర్థం.

ఇంకో అర్థం:

దిక్కులే వస్త్రములుగా కలిగిన వాడు. అగ్నికి వస్త్రం చుట్టగలమా? చుట్టిన వస్త్రం తగలబడుతుంది కానీ, అగ్నిని కప్పలేదు. అలాగే పరమాత్మని ఏ ఒక్కటి కప్పలేవు. కప్పాము అంటే పరిమితి ఉంది. పరమాత్మ అపరిమితుడు/ అనంతుడు / ఆవరణ / మాయ లేని వాడు.

ఇంకో అర్థం:

అంబరము అంటే వ్యాపకం అని అర్థం. దిగంబరుడు అంటే దిక్కులు అంతటా / దిగంతాలలో వ్యాపించిన వాడు.

## 83. శ్రీ అష్టమూర్తయే నమః

ఈ నామం చాలా విశిష్టమైన నామం. వేదాంత శాస్త్రం, ఈ ఒక్క నామాన్ని ఎవరు ఉపాసన చేస్తారో, వారు ధన్యత పొందుతారు, అని చెప్తుంది. పరమేశ్వరుడు ప్రత్యక్ష మూర్తా, పరోక్ష మూర్తా అంటే మన శాస్త్రం భగవంతుడు ప్రత్యక్ష మూర్తి అనే అంటుంది. కనబడేది భగవంతుడు అని తెలుసుకోలేక పోతున్నాము. సృష్టి లో మనము చూసేవి అన్నీ ఎనిమిది స్వరూపాల తో ఉంటాయి. అవి భూమి, నీరు, అగ్ని,వాయువు ,ఆకాశము , సూర్యుడు, చంద్రుడు ,

యజమాని( జీవ చైతన్యం). వీటిలో ప్రవేశించి, త్రిగుణాతీతము గా ఉన్నాడు. విశ్వం అంతా వ్యాపించిన సగుణ బ్రహ్మమే విశ్వానికి అతీతం గా నిర్గుణ బ్రహ్మమై ఉన్నది. విశ్వం లో ఉన్న మనం శివుడి రూపం లో ఉన్న ఎనిమిది మూర్తులని ఉపాసన చేస్తూ ఉంటే, విశ్వాతీతంమైన త్రిగుణాతీతమైన పరతత్వాన్ని పొంద గలం. అష్టమూర్తి ఉపాసనే మనకి ఇహము పరము లభింప చేస్తుంది. మన చుట్టూ ఉన్న ప్రకృతి స్వరూపులు మనకి అనుకూలిస్తేనే మన జీవితం. ఈ ఎనిమిది మూర్తులు శివుడే అని తెలిసాక, ఇంకా సర్వం శివ మయం అనే ఎరుక ఏర్పడుతుంది, అప్పుడు, ఈ మూర్తులని ప్రపంచాన్ని విడిచిపెట్టి, శివుడితో తాదాత్మ్యం చెందుతాము. ఇదే అష్టమూర్తి ఉపాసనతో ఉన్న రహస్యం. ఇవి శివునియొక్క ప్రత్యక్ష స్వరూపాలు. అది తెలుసుకున్నవారికి శివం లభిస్తుంది. నిరంతర ఈ భావన చేసినవారికి ప్రతి కాలం, ప్రతి చోట శివ రక్షణ లభిస్తుంది. ఈ అష్టమూర్తి ఉపాసన ఐహిక జీవితానికి పారమార్థిక జ్ఞానానికి ఉపకరిస్తుంది . సర్వం ఈశ్వరమయం అయినప్పుడు, ఈ తెలుసుకుంటున్నవాడు కూడా ఈశ్వరుడే అయ్యాడు (సోహం అనే అద్వైత భావం). ఈ అష్టమూర్తి భావం తో ప్రపంచాన్ని చూస్తే జీవితంలో సుఖం శాంతి లభిస్తుంది, క్రమంగా సర్వం శివమయం అనే ఎరుక కలిగి, "శివోహం" అనే అద్వైత భావం లోకి తీసుకుని వెళుతున్నది. సర్వం శివమయం జగత్ అనే జ్ఞానం సిద్ధిస్తుంది. శివపూజ కి అష్టమూర్తి నామాలు తెలుస్తే చాలు, మిగిలినవి తెలిసినా తెలియక పోయినా.

**భవాయ దేవాయ నమః (జలం)**

**శర్వాయ దేవాయ నమః (భూమి)**

**ఈశానాయ దేవాయ నమః (సూర్యుడు)**

**పశుపతయే దేవాయ నమః (జీవచైతన్యం/ యజమాని)**

**రుద్రాయ దేవాయ నమః (అగ్ని)**

**ఉగ్రాయ దేవాయ నమః (వాయువు)**

భీమాయ దేవాయ నమః (ఆకాశము)

మహతే దేవాయ నమః (చంద్రుడు)

ఈ ఎనిమిది నామాల శక్తులను శివుడి పత్నులుగా భావం చేస్తూ:

భవస్య దేవస్య పత్నియై నమః

శర్వస్య దేవస్య పత్నియై నమః

ఈశానాస్య దేవస్య పత్నియై నమః

పశుపతైర్ దేవస్య పత్నియై నమః

రుద్రస్య దేవస్య పత్నియై నమః

ఉగ్రస్య దేవస్య పత్నియై నమః

భీమస్య దేవస్య పత్నియై నమః

మహతోదేవస్య పత్నియై నమః

శక్తి లేందే శివుడు లేదు. ఇరువురిని ఇలా ఆరాధించాలి. అష్ట మూర్తులు శివశక్త్యాత్మకం అని ఉపాసన చెయ్యాలి. అష్టమూర్తులు శివుడి విశ్వరూపం.

84. శ్రీ అనేకాత్మనే నమః

లోకం లో అనేక శరీరాలు ఉపాధులు కనపడుతున్నాయి. వీటి అన్నిటా శివుడే ఉన్నాడు చైతన్యముగా అనేక రూపములతో ఉన్నవాడు.

"సర్వో ఏష రుద్రాహా"

అన్ని రూపులు తానేయై ఆత్మా గా ఉన్నవాడు. అందరికి ఆత్మ గా ఉన్నవాడు. ఉపాధిలో తేడా ఉన్నది కానీ ఆత్మ లో లేదు.

భగవద్గీత లో అన్నట్టు: నశించినవాటిలో నశించకుండా ఉండేవాడు భగవంతుడు.

**"సమం సర్వేషు భూతేషు"**

## 85. శ్రీ సాత్వికాయ నమః

భగవంతుడి స్వరూపం శుద్ధ సత్త్వ గుణం తో కూడి ఉంటుంది. రజో తమో గుణములు లేని శుద్ధ సత్త్వ గుణం తో ఉండే వాడు **"సాత్వికాయ నమః"**

లోకంలో బ్రహ్మ అంటే రజో గుణం, శివుడు తమో గుణం, విష్ణు సత్త్వ గుణం అని అంటారు. కానీ నిజానికి ఏవీ వారి గుణాలు కావు. పరమేశ్వరుడు ఈ మూడు గుణాలను నియమించేటప్పుడు ఈ రూపాలు తీసుకుంటాడు. ప్రళయకాలం లో తన తమోగుణాన్ని వ్యక్త పరుస్తాడు / నియంత్రిస్తాడు. నిజానికి పరమేశ్వరుడు తమోగుణానికి అతీతుడు. సహజంగా శివుడు సత్వ గుణ సంపన్నుడు, గుణాతీతుడు. సత్త్వమును ప్రవర్తింపచేయువాడు. సత్త్వ గుణం ఉంటేనే జ్ఞానము ఆనందము లభిస్తాయి . సాత్వికః అంటే సుఖ జ్ఞాన స్వరూపుడు.

ఇంకో అర్థం:

సత్త్వము అంటే బలము / ప్రాణము. బలము, ప్రాణము కలిగి ఉన్న వాడు.

## 86. శ్రీ శుద్ధవిగ్రహాయ నమః



స్వామి విగ్రహం నిర్మలంగా భాసిస్తుంది. ఏ దోషము లేని విగ్రహం: శుద్ధ విగ్రహః శుద్ధమైన ఆకారంగల వాడు. పరమేశ్వరుడి విగ్రహం మనలాంటి శరీరంకాదు.

**"అప్రాకృత శరీరం చ అతిమన్మథరూపిణం ఘృతరీతి ఘనీభూత సచ్చిదానంద విగ్రహం** ("పురాణాలలో చెప్పిన విగ్రహం")

పంచభూత వికారాలు లేని రూపం: అప్రాకృతం. ప్రాకృతమైన వాటికి నశించటం మార్పు చెందటం అనే దోషాలు ఉంటాయి. సృష్టిలో ఏదైనా అందంగా ఉంది అంటే మన్మధుడితో పోలుస్తాము. శివుడిది "అతిమన్మధరూపం".

**"ఘృతరీతి ఘనీ భూతం":** నెయ్యి ఘనీ భవస్తే గట్టి ఆకారం లో ఉంటుంది. నెయ్యి అసలు స్థితి ద్రవీభూతం, కానీ గట్టిగా కనిపిస్తుంది. అల్లాగే పరమాత్మ స్వతఃసిద్ధంగా  నిర్గుణుడైనవాడు కానీ నెయ్యి వలే రూపముగా ఘనీభవిస్తాడు . ఆ రూపం అత్యంత నిర్మలమైనది.

శివుడి రూపము సచ్చిదానందముల యొక్క ఘనీభవ రూపందోషరహితమైన శుద్ధ విగ్రహాన్ని ధ్యానిస్తే మనం శుద్ధులం అవుతాము.

## 87. శ్రీ శాశ్వతాయ నమః

సాత్వికః, శుద్ధవిగ్రహః, శాశ్వతహ అనే నామాలు శివుడి యొక్క అసలు తత్త్వాన్ని చెప్తాయి.ఎల్లవేళలా ఉండే వాడు.  ఎప్పుడు మార్పు లేకుండా ఉంటాడు.  "సృష్టి పూర్వం, సృష్టి అందు, సృష్టి నశించక ఉండే వాడిని నేనే"!

**"శేతే ఇతి శివః"** ఎప్పుడు ఉండేవాడు. మనం ఉండి పోయేవాళ్ళం. శివుడు "ఉండిపోయేవాడు"/ ఉండువాడు.

## 88. శ్రీ ఖండపరశవే నమః

ఖండమైన పరశువు కలిగి ఉన్నవాడు. ఖండము అంటే ముక్క గా ఉన్నది పరశువు. అసుర సంహారం చేసినప్పుడు స్వామి గొడ్డలి విరిగింది. విరిగి ఉన్న గొడ్డలి పట్టుకుని ఉన్న వాడు.

ఇంకో అర్థం:

దేనినైనా ఖండపరిచే పరశువు కల వాడు.

## 89. శ్రీ అజాయ నమః

జన్మ లేని వాడు. పుట్టుక అనేది లేని వాడు. అభవుడు/ స్థాణువు / శాశ్వతుడు అంటే ఫలానా అప్పుడు పుట్టాడు అని చెప్పలేము.

పుట్టుక ఉంటే పరిమితం ఉంటుంది. అపరిమితమైన పరమాత్మ కి పుట్టుక ఉండదు. శివుడికి అవతారాలు తక్కువ. అవతారం తీసుకుంటే జ్ఞాన అవతారమే ఎక్కువ గా ధరిస్తాడు. అవతరించాడు అంటే పుట్టాడు అని కాదు, తనని తాను వ్యక్త పరుచుకున్నాడు.శివుడి దివ్యత్వం చెప్పబడుతున్నది .

## 90. శ్రీ పాశవిమోచకాయ నమః


పాశములు తొలగించువాడు. పాశము అంటే కర్మ పాశము, గుణ పాశములు, ఇంకా ఎన్నో పాశములు ఉన్నాయి. అన్నిటినీ కలిపి మాయ పాశం/ అవిద్య పాశము అని మరొక పేరు. ఏనుగుని కట్టే తాడులో ఎన్నో తాళ్లు ఉంటాయి, అలాగే జీవుడిని కట్టే అవిద్య అనే పెద్ద తాడు,ఇందులోనే కర్మ పాశాలు, గుణ పాశాలు,మోహపాశాలు మొదలైనవి ఉన్నాయి. జీవుల కర్మ కొద్దీ పరమేశ్వరుడు పాశాలు తగిలిస్తాడు,

యోగ్యులైనవాళ్లు ఆశ్రయిస్తే వాటిని తొలగించేవాడు పరమేశ్వరుడే. పాశం తొలగించుకునే శక్తి మనకు లేదు. పాశం తో బంధింప బడితే బంధం. పాశం తొలగిపోతే మోక్షం. పాశాబద్ధులు అంటే పరిమితి కలవారు. (కాల, దేశ, వస్తు పరిమితి). కాలాతీత స్థితి పొందాలి అంటే ఈ పశువుల్ని పాశాలని నియంత్రించే పశుపతిని ఆశ్రయించాలి. మోక్ష ప్రదాత / కారకః. మోక్షం అంటే శివ అనుభూతి.

## 91. శ్రీ మృడాయ నమః

ఆనందము కలిగించువాడు. ఆనందింప చేసే స్వరూపం కలిగినవాడు. "పరమాత్మా!, నీ యొక్క దివ్య మంగళ స్వరూపము తో నన్ను ఆనందింప జేయుము" అని వేడుకోవాలి. కర్ణాటక లో, గోకర్ణ క్షేత్రం దగ్గర లో మృడేశ్వరుడు అనే ఆలయము ఉంది.

## 92. శ్రీ పశుపతయే నమః



పరమేశ్వరుడి దివ్య నామాలలో ఈ నామం ఒకటి. అష్ట మూర్తి నామాలలో యజమాన మూర్తిని తెలియ చేసే నామం ఇది. బ్రహ్మ నుంచి పిపీలకాల వరకు పశువులే. వీరందరూ పరమేశ్వరునికి అధీనులే. పాశానికి బద్ధులై ఉంటారు. పశుపతి శివుడు. అజ్ఞానం కలిగిన వాడు పశువు. అజ్ఞానమే పాశం. పరమేశ్వరుడు ఒక్కడే పాశానికి అతీతుడైన వాడు. "పశువు" బైట పడాలని ఆశిస్తే పశుపతిని ఆశ్రయించాలి.

పశుపతి ని ఆశ్రయిస్తే పాశములు తొలగిపోతాయి, అప్పుడు ఆ జీవుడు శివుడు అయిపోతాడు / శివుడిలో ఐక్యం అవుతాడు. జీవుడికి శివుడికి భేదం పాశం ఒక్కటే.

"జీవోహం శివోహం అవుతాడు"!

## 93. శ్రీ దేవాయ నమః

దేవః అంటే స్వయం ప్రకాశ స్వరూపుడు.

ఇంకో అర్థం:

ఆడుకునే వాడు. లోకాన్ని ఒక ఆట లా నడిపిస్తాడు.

**"లోకావత్ లీలా కైవల్యం".**

ఇంకో అర్థం లో ఉపనిషత్ చెప్తోంది:

**"ఏకో దేవః సర్వ భూతేషు గూఢహ"!**

తిలంలో తైలం వలే,పాల లో వెన్న వలే, సర్వ  భూతములలో రహస్యంగా ఆత్మ స్వరూపుడైన ఈశ్వరుడే " దేవుడు" !

94. **శ్రీ మహాదేవాయ నమః**

శివుడి నామాలలో అత్యంత ఉత్కృష్టమైన నామాలలో ఇది ఒకటి. మహాభారతం లో కృష్ణుడు ఈ నామానికి అర్థం చెప్తూ:

ఈ విశ్వము అంతటినీ స్వయం ప్రకాశ స్వరూపముగా పాలించే వాడే "మహాదేవుడు" అన్నాడు.

**"తత్పురుషాయ విద్మహే మహాదేవాయ ధీమహి**


**తన్నో రుద్రః ప్రచోదయాత్".**

అష్ట మూర్తులలో చంద్రుడికి వర్తించే నామం ఇది.

**"శ్రీ మహాదేవాయ చంద్రాత్మనే నమః"!**

95. **శ్రీ అవ్యయాయ నమః**

తత్త్వ ప్రతిపాదకమైన నామం ఇది. "వ్యయము" అంటే తరుగుదల. "అవ్యయము" అంటే తరుగుదల లేని వాడు. పెరుగుదల, తరుగుదల రెండూ లేవు. పరిపూర్ణుడికి ఈ రెండూ ఉండవు.



ఇంకో అర్థం:

వికారము లేని వాడు. వికార రహితుడు.

ఇంకో అర్థం:

స్త్రీ పురుష నపుంసకాది భేదము లేని వాడు. లింగ భేదం లేని వాడు.

96. **శ్రీ హరయే నమః**

హరి అనేది విష్ణు నామము. మహాభారతంలో హరివంశంలో కృష్ణ పరమాత్మ శివుడితో అన్నాడు "నీ నామాలు అన్నీ నావి, నా నామాలు అన్ని నీవి" అని! శివ కేశవుల ఏకత్వం ప్రతిపాదింప బడుతోంది. శివుడే నారాయణ రూపుడు.



info@gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose

**ఇంకో అర్థం:**

హవిస్సులను ఆహరించువాడు. యజ్ఞములో వేసే హవిస్సులను స్వీకరిస్తాడు, యజ్ఞ మూర్తి స్వరూపుడు, యజ్ఞాగ్ని రూపుడైన శివుని "హరిః" అంటారు.

### 97. శ్రీ పూషదంతభిదే నమః

ద్వాదశ ఆదిత్యులలో ఒక ఆదిత్యుడి పేరు "పూష". దక్షయజ్ఞం లో పాల్గున్నవాడు ఈ ఆదిత్యుడు. అప్పుడు వీరభద్రుడు వచ్చి పూష అనే ఆదిత్యుడి పళ్ళు రాలగొట్టాడు, శిక్ష గా (శివుడిలేని యజ్ఞం జరగటం మూలంగా).

### 98. శ్రీ అవ్యగ్రాయ నమః

అవ్యగ్రహ అంటే తడబాటు/ చెదిరిపోవటం లేని వాడు. పరమాత్మ వీరత్వం ప్రకటించేటప్పుడు చెక్కుచెదరడు.చెక్కుచెదరని ఏకాగ్రత జ్ఞానం ఈశ్వర స్వరూపము కనుక " అవ్యగ్రహ" అంటారు.

### 99. శ్రీ దక్షాధ్వరహరాయ నమః

దక్ష యజ్ఞం ధ్వంసం చేసినవాడు. వీరభద్రుడి రూపములో విజృంభించిన శివ స్వరూపం. "భగవంతుడు లేడు, నేనే సర్వ సమర్థుడిని" అని అనుకునేవారు అందరు దక్షులే. వాళ్ళు చేసే పనులు "దక్షయజ్ఞాలు". ఆ పనులు ధ్వంసం అవుతాయి .వీడు దక్షుడు, అతడు దక్షిణామూర్తి. సమర్థతలు అన్నీ మనవే అని విర్రవీగిటం అహంకారం. అసలైన సమర్థుడు పరమేశ్వరుడు. అది తెలుసుకుంటే అప్పుడు ఆ పని చక్కని యజ్ఞం అవుతుంది . దుష్ట యజ్ఞములను ధ్వంసం చేయువాడు.

## 100. శ్రీ హరాయ నమః

సర్వము హరించువాడు. అజ్ఞానాన్ని నశింప చేయు వాడు / దుఃఖాన్ని తొలగించువాడు. ప్రళయ కాలం లో సర్వమును లయింపచేస్తాడు. యజ్ఞాగ్నిగా హవిస్సులు స్వీకరిస్తాడు కనుక హరుడు.

ఇంకో అద్భుతమైన అర్థం:

పంచ భూతములు పరంగా:

"హ" : ఆకాశ వాచకం

"ర": అగ్ని వాచకం

ఆకాశమునందు ఉన్న అగ్ని, అంటే తేజస్సు అతడు. హృదయ ఆకాశమే "హ". ఆ హృదయాకాశం లో ఉన్న జ్యోతి "ర". హర అంటే హృదయాకాశం లో ప్రకాశించే పరంజ్యోతి. ఇది నిజమైన అర్థం,మనం స్వీకరించవలసిన అర్థం .

## 101. శ్రీ భగనేత్రభిదే నమః

ద్వాదశ ఆదిత్యులలో "భగుడు"అనే ఆదిత్యుడు ఉన్నాడు .దక్షయజ్ఞం లో హాజరు అయ్యాడు. వీరభద్రుడు వాడి కళ్ళు ఊడపీకాడు. భగుడు అనే ఆదిత్యుడి నేత్రములు ఊడపీకినవాడు కనుక "భగనేత్రభిదే" నమః. దీని బట్టి తెలుసుకోవసిది ఏమిటి అంటే, దేవతలైనా శివుడి శిక్షకి తల వంచవలసిందే. దేవతల శాసకుడు పరమేశ్వరుడు. పురాణముల యందు పరిశీలిస్తే దేవ రక్షకుడు, దేవ శిక్షకుడు కూడా శివుడే. మార్కండేయుడిని రక్షించటానికి యముడిని శిక్షించాడు, దక్ష యజ్ఞం లో దేవతలను శిక్షించాడు. బ్రహ్మ ని కూడా తన ఆది అంతములు తెలుసుకోలేకపోయి అబద్ధం ఆడినప్పుడు శిక్షించాడు.

### 102. శ్రీ అవ్యక్తాయ నమః

వ్యక్తం అయితే ప్రపంచం. వ్యక్తం కానీ పరమాత్మ తత్త్వం నిర్గుణము. ఆ నిర్గుణమైన తత్త్వానికి "అవ్యక్తాయ" నమః అని నమస్కారం చేస్తాము.

### 103. శ్రీ సహస్రాక్షాయ నమః

ఇంద్రుడికి సహస్రాక్షుడు అనే నామం ఉంది (వేల నేత్రములు కల వాడు). ఇంద్ర రూపుడు కూడా శివుడే. **"అగ్నిస్చమే ఇంద్రస్చమే"**. ఇంద్రుడికి శివుడికి అభేదం. వేల కన్నులు కల వాడు అంటే అనంత దర్శన శక్తి సంపన్నుడు అని అర్థం. సృష్టి లో ఏ ప్రాంతాసైనా, కాలాన్నైనా, అణువు మొదలు బ్రహ్మాండం వరకు అవధి లేని దర్శనం పరమేశ్వరుడిది. ఆయన చూపుకి అడ్డములేదు. సర్వ జగత్తుని అనంత కాలమునందు, అనంతముగా దర్శించేవాడు కనుక **"సహస్రాక్షహ"**!

ఇంకో అర్థం:

సహస్రాక్షహ అనేది సూర్యుడి పేరు. సహస్రకిరణాల తో దర్శన శక్తి కల ఆదిత్య భగవానుడి పేరు. అక్షం అంటే ఇంద్రియములు. అనంతములై ఇంద్రియములు కలవాడు. కళ్ళు లేవు దేనిసైనా చూడగలడు, కాళ్ళు లేవు ఎక్కడికైనా వెళ్లగలడు, చేతులు లేవు దేనిసైనా పట్టుకోగలడు, చెవులులేవు దేనిసైనా వినగలడు. అంటే అనంత ఇంద్రియశక్తి సంపన్నుడు.

### 104. శ్రీ సహస్రపదే నమః

అంతటా వ్యాపించి వెళ్లగలిగేశక్తి కల వాడు.

### 105. శ్రీ అపవర్గప్రదాయ నమః

వర్గము అంటే ధర్మ అర్ధ కామములు. వీటికి విభాగాలు ఉన్నాయి. విభాగాలు లేనిది "మోక్షం". విభాగము లేని మోక్షం ఇచ్చేవాడు కనుక "అపవర్గప్రదాయః"



info@gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose

<u>ఇంకో అర్థం:</u>

"ప" వర్గం అంటే "ప ఫ బ భ మ". వీటిని పరమాత్మ తొలగిస్తాడు.

ప: పాపము / పుణ్యము (పరిణామము)

ఫ: ఫలము

బ: బంధము

భ: భయము

మ: మరణము

ఈ ఐదులేకుండా చేసే వాడు ఎవడో అతడు "**అపవర్గప్రదః**" అనగా మోక్ష ప్రదాత.

## 106. శ్రీ అనంతాయ నమః

**"సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ**

**సర్వ వ్యాపి చ భగవాన్**

**తస్మాత్ సర్వ గతిః శివః అనంతం అవ్యయం కవిగం సముద్రేస్తం విశ్వశంభువం"!** ఇలా పరమాత్మ తత్వమే అనంతము.

## 107. శ్రీ తారకాయ నమః

తరింప చేయునది తారకం. మోక్ష కారక శివుడే తారక స్వరూపుడు.

<u>ఇంకో అర్థం:</u>

తారకం అంటే పంచాక్షరి. పంచాక్షరీ మంత్ర రూపుడు.

<u>ఇంకో అర్థం:</u>

ఓంకారః తారహ్

ఓంకార స్వరూపుడు / ప్రణవ మూర్తి. పంచాక్షరీ స్థూలమైన ప్రణవము. ఓంకారం సూక్ష్మ రూప ప్రణవం. ఓంకారంలోని "అ" కార "ఉ" కార "మ" కార,బిందు నాద స్వరూపములే పంచాక్షరీ అక్షరములుగా  అయింది .

108. **శ్రీ పరమేశ్వరాయ నమః**

పరమేశ్వరుడు అంటే ఆయనని మించి ఇంకో ఈశ్వరుడు లేడు. జీవులకు గమ్యం ఐనవాడు. సర్వోత్కృష్టమైన తత్త్వము. మోక్ష కాంక్ష కలిగిన వారు పరమేశ్వరుని ఉపాసించాలి. శివుడే ఈశ్వరుడు. విషయ లంపటత్వములన్నీ విడిచిపెట్టి చెక్కు చెదరని మనసుతో శివుని ధ్యానించు. ఎందుకంటే ఆయనని మించిన పరతత్త్వం మరొకటి లేదు.

ఈ నూటఎనిమిది నామములు శివుడి తత్త్వాన్ని,లీలలనీ,  గుణాలని, మహిమా  వైభవాన్ని, రూప వైభవాన్ని చెపుతున్నాయి .ఈ నామములు వేదముల తో సమానము,ఆమ్నాయ సంహితం, వేదములనుంచి స్వీకరింపబడినవి అన్నాడు నారాయణుడు.

వీటిని, జగదంబ గౌరి, ఉపదేశంగా పొంది శివుని చేపట్టింది.అలాంటి నామములు త్రికాలములలో పఠిస్తే,  వేదములలో ఉన్న రుద్రం పారాయణ చేసిన ఫలితం లభిస్తుంది అని చెప్పాడు నారాయణుడు. అటువంటి శివ నామాలకు, శివునకు నమస్కరిస్తూ, సర్వం శ్రీ శివచరణారవిందార్పణమస్తు!!!



info@gurujnanam.org Disclaimer: This document is not for commercial purpose

